Estd : 1998, RNI No.68319/98
గోల్కొండ TV
హైదరాబాద్,గురువారం,
మే 21, 2026
పేజీలు : 8+4
సంపుటి: 28,సంచిక:297

మెట్రో ఈవినింగ్స్

రూ.6 /-

ఎడిటర్ : దేవరకొండ కాళిదాస్

Published from Hyderabad http://epaper.metroevenings.com Metro Evenings Telugu Daily

గురువారం, తేది:21-05-2026 శ్రీ పరాభవ నామ సంవత్సరం,అధిక జ్యేష్ఠ మాసం,ఉత్తరాయణం-వసంత రుతువు,బహుళ పక్షం,పంచమి,పునర్వసు,వర్జ్యం,సా.5.19 ల 6.50

## విజిలెన్స్‌కు మరిన్ని అధికారాలు



హైదరాబాద్ (మెట్రో న్యూస్): సైబర్ క్రైమ్ నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నియంత్రణపైన అధ్యయనం చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలని తనను కలిసిన సీనియర్ పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. ఫోరెన్సిక్ సెంటర్స్, డేటా సెంటర్లని పెంచుకోవాల్సిన అవసరం ఉంది.. పోలీస్ ట్రైనింగ్‌లోనే సైబర్ క్రైమ్ విభాగంలో పని చేయడం కోసం సెలక్షన్ జరగాలన్నారు.

# ఇన్వెస్ట్ తెలంగాణే ఎజెండా



**పరిశ్రమలకు భూ కేటాయింపులపై సీఎం సమీక్ష**
**ప్రజాప్రతినిధులు,సివిల్ సర్వీసు అధికారులు,జర్నలిస్టులకు 500 ఎకరాల స్థల సేకరణ కోసం ఆదేశం**

హైదరాబాద్ (మెట్రో న్యూస్): ఫ్యూచర్ సిటీ కేంద్రంగా ఏర్పాటయ్యే పరిశ్రమలపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సమీక్ష నిర్వహించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో భూముల కేటాయింపు, పరిశ్రమల ఏర్పాటుపై పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఇతర ఉన్నతాధికారులతో చర్చించారు. ఇన్వెస్ట్ తెలంగాణ పేరుతో పెట్టుబడుల ఆకర్షణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలి.. ఇన్వెస్ట్ తెలంగాణ కోసం ఆకర్షణీయమైన లోగో, వెబ్ సైట్ రూపొందించాలి.. ఇన్వెస్ట్ తెలంగాణ కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారి కోసం ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థను రూపొందించాలని నిర్దేశించారు. ఫ్యూచర్ సిటీలో ప్రజా ప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్టులకు 500 ఎకరాలు కేటాయించాలని సీఎం ప్రతిపాదించారు. 1500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటు చేయాలన్నారు. బుధవారం నాడు మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలోని బోధి పెవిలియన్‌లో పరిశ్రమల శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, అంతర్జాతీయ స్థాయి నగరాలను అధ్యయనం చేయాలని.. ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేసిన తర్వాతే భూ కేటాయింపులు చేయాలని సూచించారు.




## నేటినుంచే
# సరస్వతీ అంత్య పుష్కరాలు

**కంచి స్వామీ శ్రీ విజయేంద్ర సరస్వతీ, గవర్నర్ శుక్లా తొలి పుష్కర స్నానం**

హైదరాబాద్ (మెట్రో న్యూస్): సరస్వతీ అంత్య పుష్కరాలు గురువారం ప్రారంభం కానున్నాయి. కాళేశ్వరం వద్ద జరిగే ఈ పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లను చేసింది. పుష్కర స్నానాలు 12 రోజుల పాటు కొనసాగి వచ్చేనెల 1వ తేదీన ముగుస్తాయి. పుష్కరాలకు 30 నుండి 40 లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. పుష్కరాల తొలిరోజు తెల్లవారు జామున 5.43 గంటలకు కంచి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాలు పుష్కర స్నానం చేసి అంత్య పుష్కరాలను లాంఛనంగా ప్రారంభిస్తారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరవుతారు. ప్రతీ రోజూ ఒక ప్రముఖ పీఠం స్వామిజీ ఈ పుష్కారాల్లో పాల్గొని పుణ్య స్నానం చేస్తారు. ప్రతీరోజూ ఉదయం హోమాల నిర్వహణ, సాయంత్రం పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.



## 'మోదీ దేశద్రోహి'

**ప్రధానిపై రాహుల్ వివాదాస్పద వ్యాఖ్యలు**

ఇంటర్నెట్ డెస్క్: ప్రధాని నరేంద్ర మోదీపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మోదీ 'దేశద్రోహి' అని విమర్శించారు. దేశాన్ని అమ్మేశారంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సొంత నియోజకవర్గమైన రాయ్‌బరేలీలో ఓ బహిరంగ సభలో పాల్గొన్న ఆయన బుధవారం ఈ వ్యాఖ్యలు చేశారు. "ఎండను సైతం లెక్కచేయకుండా వచ్చిన మీకు ధన్యవాదాలు.

## తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగలు
# నిర్మల్‌లో 46.5,పిడుగురాళ్లలో 47.6 డిగ్రీలు




**తెలంగాణలోని 19 జిల్లాల్లో 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు ఏపీలోని 11 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు రానున్న నాలుగు రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరుగుతుందని హెచ్చరిక**

హైదరాబాద్ (మెట్రో న్యూస్): తెలుగు రాష్ట్రాల్లో భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. రెండు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లోని పిడుగురాళ్లలో 47.6 డిగ్రీలు, తెలంగాణలోని నిర్మల్‌లో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యాయి. తెలంగాణలోని 19 జిల్లాల్లో 46 డిగ్రీలకు పైగా, ఏపీలోని 11 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయినట్లు అధికారులు తెలిపారు.తెలంగాణలోని హన్మకొండలో 46.4, జగిత్యాలలో 46.3, ఆదిలాబాద్‌లో 46.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏపీలో కృష్ణా జిల్లాలోని కంకిపాడు, మార్కాపురంలోని నందనమారెళ్ల, 46.1 డిగ్రీలు, తణుకులో 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రానున్న నాలుగు రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరుగుతుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

## ఎండలతో జాగ్రత్త

**రాష్ట్ర ప్రజలకు సీఎం సందేశం**

హైదరాబద్ (మెట్రో న్యూస్): తీవ్రమైన వడ గాలులు, ఎండ తీవ్రతపై వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండనున్నందున ఆయా జిల్లాల అధికారులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు తగిన సంఖ్యలో అందు బాటులో ఉంచాలని, తాగు నీరు, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఎం ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మొదలు జిల్లా ఆసుపత్రుల వరకు వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.



# 20 బిలియన్ యూరోల టార్గెట్

**ఇటలీతో మోదీ స్పెషల్ డీల్!**

రోమ్/ న్యూఢిల్లీ: భారత్, ఇటలీ దేశాల మధ్య దౌత్య, వాణిజ్య సంబంధాలు సరికొత్త మైలురాయిని అందుకున్నాయి. ఇరు దేశాల మధ్య సంబంధాలను 'స్పెషల్ (స్టాటజిక్ పార్టనర్‌షిప్' (ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం) స్థాయికి పెంచుతున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ఇటలీ రాజధాని రోమ్‌లో ఆ దేశ ప్రధాని జార్జియా మెలోనితో ప్రధాని మోదీ జరిపిన ద్వైపాక్షిక చర్చల అనంతరం ఇరు దేశాల అధినేతలు ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. భారత్-ఇటలీ సంబంధాలు ఇప్పుడు తమ పూర్తి సామర్థ్యాన్ని చాటుకునే స్థాయికి చేరుకున్నాయని ప్రధాని మోదీ ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆసిఫాబాద్ గడ్డపై 'ఇందిరమ్మ పండుగ'

హైదరాబాద్ (మెట్రో న్యూస్): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న పేదల సొంతింటి కలలను నిజం చేసే ప్రతిష్ఠాత్మక 'ఇందిరమ్మ ఇండ్ల' రెండో విడత కార్యక్రమానికి కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వేదిక కానుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో... రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బుధవారం జిల్లాలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు.మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్ హాజరయ్యారు.



ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.



# బోగస్ ప్రచారాన్ని పట్టించుకోను

హైదరాబాద్ (మెట్రో న్యూస్):బండి సంజయ్ కొత్త పార్టీ పెడుతున్నారంటూ కొందరు ఫాల్తుగాళ్లు ప్రచారం చేస్తున్నారని, అట్లాంటి వాటికి స్పందించాల్సిన అవసరమే లేదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించారు. కొడుకు భగీరథ్ పోక్సో కేసు ఎపిసోడ్ తర్వాత బుధవారం మొదటిసారి రాష్ట్ర బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి విచ్చేసిన బండి సంజయ్ పలువురు పార్టీ నాయకులతో కలిసి మీడియా అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు.

## శంషాబాద్ విమానాశ్రయంలో పట్టుపడిన హైగ్రేడ్ గంజాయి

హైదరాబాద్,(మెట్రో న్యూస్): శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో హైగ్రేడ్ గంజాయి భారీగా పట్టుపడింది. బ్యాంకాక్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఇద్దరు ప్రయాణికుల వద్ద గంజాయిని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) అధికారులు గుర్తించారు. నిందితులు విమానం దిగిన వెంటనే డీఆర్ఐ అధికారులకుఅనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని నిలువరించి లగేజీ తనిఖీ చేయగా గంజాయి బయటపడింది.

# బొగ్గు గ్యాసిఫికేషన్‌కు సహకరించండి

**కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి డిప్యూటీ సీఎం భట్టి విజ్ఞప్తి**



ఢిల్లీ (మెట్రో న్యూస్): దేశవ్యాప్తంగా బొగ్గు గ్యాసిఫికేషన్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, సింగరేణి కూడా ఆ దిశగా ముందడుగు వేయడానికి సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బొగ్గును కేవలం సంప్రదాయ విద్యుత్ ఉత్పత్తికే పరిమితం చేయకుండా, భవిష్యత్ పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విలువ ఆధారితంగా వినియోగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డితో ఉప ముఖ్యమంత్రి భట్టి సమావేశమయ్యారు . ఈ సమావేశంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ భవిష్యత్ ప్రణాళికలు, బొగ్గు గ్యాసిఫికేషన్ అవకాశాలు, కొత్త బొగ్గు బ్లాకుల కేటాయింపు, తాడిచెర్ల కోల్ బ్లాక్-II మైనింగ్ లీజ్ అంశాలపై చర్చించారు.

## 23న యాదగిరిగుట్టకు సీఎం రేవంత్ రెడ్డి :ఎంపీ చామల



**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 23న యాదగిరి గుట్టకు వస్తున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తెలిపారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి క్షేత్ర అభివృద్ధిలో భాగంగా ఈ నెల 23వ తేదీన ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. యాదగిరిగుట్టలో ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వేద పాఠశాల, దేవస్థాన వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మాట్లాడుతూ... ఆధ్యాత్మిక కేంద్రంగా యాదగిరిగుట్టను మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వేద సంస్కృతిని కాపాడేందుకు ఏర్పాటు చేస్తున్న వేద పాఠశాల, అలాగే దేవస్థానంలో మరిన్ని మౌలిక వసతుల కల్పన కోసం జరుగుతున్న ఈ అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాన్ని నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమ సన్నాహక సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల అధ్యక్షులు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి పర్యటనను అద్భుతంగా విజయవంతం చేసేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు.

## మండల అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేసిన ఎంపీ



**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామలకిరణ్‌కుమార్ రెడ్డి డిసిసి అధ్యక్షులు, ఆలేరు శాసనసభ్యులు, ప్రభుత్వవిప్‌బీర్లఐలయ్య పిలుపునిచ్చారు. ఆలేరు నియోజకవర్గ పరిధిలోని నూతన మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల నియామక ఉత్తర్వులను వారు అందజేశారు. ఎంపీ చామల మాట్లాడుతూ పార్టీ కోసం నిరంతరం శ్రమించే ప్రతి కార్యకర్తకు, నాయకుడికి కాంగ్రెస్ పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. నూతన అధ్యక్షులు అందరినీ కలుపుకొని పోతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

## న్యాయం గెలిచింది :వీహెచ్




**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** జనగణనలో కులగణన చేయాలన్న సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నట్టు మాజీ ఎంపీ, ప్రభుత్వ సలహాదారులు వీ హనుమంతరావు తెలిపారు. బుధవారం గాంధీ భవన్‌లో ఆయన మీడియా తో మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పు చారిత్రాత్మకమైనదన్నారు. న్యాయ వ్యవస్థకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. 60 కోట్ల ప్రజలకు న్యాయం చేసిన జస్టిస్ సూర్యకాంత్ కి రుణపడి ఉంటామన్నారు. కులగణన చేయాలని రాహుల్ గాంధీ ఆలోచన చేశారనీ ఆయన తెలిపారు. రేవంత్ ప్రభుత్వం కుల గణన చేసిందనీ వివరించారు. బీసీలు ఎదగడంమోదీ ప్రభుత్వానికి ఇష్టం ఉండదని మోదీ మాకు సలహాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు మాకు అన్ని విషయాలు తెలుసని 18వ శతాబ్దంలోనే జ్యోతిరావ్ ఫూలే అన్ని నేర్పాడని వీ హెచ్ తెలిపారు. గాంధీ భవన్లో సంబరాలు జన ఘనన లో కుల ఘనన చేయాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు ఆధ్వర్యంలో గాంధీ భవన్ లో సంబరాలు జరిపారు బాణసంచా కాల్చి, స్వీట్స్ పంచుకున్నారు.

## జిల్లాలకూ ఐటీ వెలుగులు

**- హైదరాబాద్ వెలుపలా జీసీసీల ఏర్పాటుకు ప్రోత్సాహం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** తెలంగాణ రాజధాని హైదరాబాద్ మహానగరానికే కాదు... జిల్లాలకూ ఐటీ వెలుగులు విస్తరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్దేశించారు. హైదరాబాద్ అవతల కూడా గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు (జీసీసీలు) ఏర్పాటు చేసేలా ప్రత్యేక పాలసీ తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ హైవేల వెంట జీసీసీలు, డేటా సెంటర్లు ఏర్పాటు చేసే కంపెనీలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలని సూచించారు. బుధవారం ఐటీ, పరిశ్రమల శాఖలపై సమీక్ష సందర్భంగా మాట్లాడుతూ, ఐటీ, ఇతర ఉద్యోగ అవకాశాలు హైదరాబాద్‌కే పరిమితం కాకుండా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు విస్తరించాలని సీఎంచెప్పారు. "బియాండ్ క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్) ప్రాంతాలను గుర్తించి అక్కడ ఐటీ, డేటా సెంటర్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఐటీ విస్తరణ పెద్దగా లేని చోట్ల కూడా డేటా సెంటర్ల ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఏఐ సిటీ, హెల్త్ సిటీ, ఇండస్ట్రియల్ కారిడార్ పనులు వేగవంతం చేయాలని అధికారులను చెప్పారు.

# జోరుగా మొక్కజొన్న కొనుగోళ్లు.. ఖమ్మం జిల్లా ముందంజ

**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** యాసంగి పంటకు సంబంధించి రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోళ్లు జోరుగా కొనసాగుతున్నాయని ప్రభుత్వం ప్రకటించింది. మొక్కజొన్న పంట ఉత్పత్తి అంచనా 43.18 లక్షల మెట్రిక్ టన్నులైతే... ఇందులో 21.59 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు జరుగుతాయని అంచనా వేసింది. ప్రభుత్వం జిల్లాల వారీగా మొత్తం 14.89 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించింది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 336 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. రాష్ట్రంలో బుధవారం నాటికి మొత్తం 11.54 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు పూర్తయిందని వెల్లడించింది. కొనుగోలు చేసిన దాంట్లో 9.53 లక్షల మెట్రిక్ టన్నులు గోదాములకు తరలించారు. ఇంకా 2.01 లక్షల మెట్రిక్ టన్నులు గోదాములకు తరలించాల్సి ఉందని పేర్కొంది. కొనుగోళ్లలోఖమ్మంజిల్లాముందంజలోఉంది. ఖమ్మంజిల్లాలో ఇప్పటివరకు 2.54 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. తర్వాతి స్థానాల్లో నాగర్‌కర్నూల్ 1.55 లక్షల మెట్రిక్ టన్నులు, వరంగల్ 1.11 లక్షల మెట్రిక్ టన్నులు, నిర్మల్ 1.05 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. నిల్వల విషయంలో మొత్తం 15.53 లక్షల



మెట్రిక్ టన్నుల స్టోరేజ్ అవసరం. ప్రస్తుతం 12.75 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ స్థలం అందుబాటులో ఉంది. ఎక్కడికక్కడే సరిపడే నిల్వ స్థలాలను గుర్తించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. అయితే రవాణా సమస్యలతో పలుచోట్ల కొనుగోళ్లు నిదానంగా సాగుతున్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

## కులగణనపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

**- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్**

హైదరాబాద్ (మెట్రో న్యూస్ )జాతి జనగణనలో బీసీ కులగణన చేపట్టవచ్చని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, సుప్రీంకోర్టు తీర్పు కులగనన వ్యతిరేకులకు చెంపపెట్టు లాంటిదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో సుప్రీంకోర్టు తీర్పు పై స్పందించారు దేశవ్యాప్తంగా బీసీ జనాభాను లెక్కించాలని, జనాభాలో సగభాగానికి పైగా ఉన్న బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు దక్కాలని తాము దశబ్దాలుగా, చేసిన పోరాట ఫలితమే ఈరోజు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అని ఆయన తెలిపారు . బీసీ జనాభా లెక్కలను సుప్రీంకోర్టు సమర్థించినందుకు సుప్రీం కోర్టుకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## వైభవంగా సరస్వతీ అంత్య పుష్కరాలు

**- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** సరస్వతీ అంత్య పుష్కరాలను భక్తి శ్రద్ధలతో వైభవంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం నుంచి జూన్ 1 వరకు కాళేశ్వరం వద్ద జరిగే సరస్వతీ అంత్య పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసిందన్నారు. పుష్కర స్నానాలు ఆచరించేందుకు తరలి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు. భక్తుల రాకపోకలకు ఆటంకం లేకుండా ట్రాఫిక్ నియంత్రణ చేయాలని చెప్పారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున భక్తులు ఆరోగ్యం కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పుష్కరాలు ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రశాంతంగా జరగాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరికీ పుష్కర శుభాకాంక్షలు తెలిపారు.

## రూ. 92 లక్షలతో అభివృద్ధి పనులు భువనగిరి ఎంపీ చామల



**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** జనగామ నియోజకవర్గ పరిధిలో పట్టణ సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమృత్ స్కీమ్ లేక్ రీ-జనరేషన్ (చెరువుల పునరుద్ధరణ) పథకంలో భాగంగా బుధవారం జనగామలో చెరువు పునరుద్ధరణ, సుందరీకరణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. మొత్తం రూ. 92 లక్షల అంచనా వ్యయంతో చేపట్టే ఈ అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనగామ శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి లు పాల్గొన్నారు. అలాగే జనగామలో ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ నీ ఎంపీ చామల ఆధ్వర్యంలో పంపిణి చేశారు. జనగామ నియోజకవర్గ పరిధిలోని అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ చెశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, జనగామ మున్సిపల్ చైర్మన్ శ్రీమతి కడకంచి బాలమణి శ్రీనివాస్ లు లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. అనంతరం జనగాం మున్సిపల్ పరిధిలోని పలు సమస్యలను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. నియోజకవర్గ స్థాయి అభివృద్ధి కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, స్థానిక కౌన్సిలర్లు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కుల గణనపై సుప్రీం కోర్టు తీర్పు స్వాగతిస్తున్నాం మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** జనగణనలో కుల గణన లెక్కింపుకు సుప్రీం కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం పట్ల రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే కుల గణన నిర్వహించి ఎవరెంతో వారికంతా అనే సామాజిక న్యాయం తో ముందుకు పోతుందని తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన మాదిరి దేశ వ్యాప్తంగా కుల గణన నిర్వహించాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారని తెలిపారు. జన గణనలో కుల గణన చేస్తామని గతంలో కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చి తరువాత కాలం 13 లో బీసీ ల అంశం చేర్చలేదని ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ హైదరాబాద్ పర్యటన లో కాలం 13 లో ఎస్సీ ఎస్టీ లతో పాటు బీసీ గణన లెక్కించాలని కోరామని గుర్తు చేశారు. కుల గణన వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్ సుప్రీం కోర్టు కొట్టివేయడం సామాజి న్యాయానికి బలాన్నిచేదిగా ఉందన్నారు. ప్రజా పాలన ప్రభుత్వం లో బలహీన వర్గాలకు న్యాయం చేయడానికి కుల గణన నిర్వహించి బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ల చేయడానికి చట్టం చేశామని ఆ బిల్లు రాష్ట్రపతి గారి వద్ద పెండింగ్ లో ఉందని కేంద్ర ప్రభుత్వం బిల్లు ఆమోదింప చేయాలని డిమాండ్ చేశారు.

# ఖైరతాబాద్ బస్తీవాసుల దుస్థితి దారుణం.. మండిపడ్డ ఎమ్మెల్సీ డా. శ్రవణ్ దాసోజు

**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** నగర నడిబొడ్డున, అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాంతంగా చెప్పుకునే ఖైరతాబాద్ నియోజకవర్గంలోని బంజారాహిల్స్ పరిధిలో బస్తీవాసులు నరకయాతన అనుభవిస్తున్నారని, కనీస మౌలిక వసతులు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్సీ డా. శ్రవణ్ దాసోజు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం ఖైరతాబాద్ నియోజకవర్గంలోని బస్తీలలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించి, వారి ఆవేదనను ఆలకించారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి అయిన రేవంత్ రెడ్డి బస్తీల అభివృద్ధిని వదిలేసి, ఫ్యూచర్ సిటీ పేరు మీద రియల్ ఎస్టేట్ దందాలో మునిగిపోయారు. ఆయనకు రియల్ ఎస్టేట్ వ్యాపారంపై ఉన్న శ్రద్ధ ప్రజల ప్రాణాలపై లేదు. ఇక



స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ విషయానికి వస్తే... ఫిరాయింపుల నేపథ్యంలో తన ఎమ్మెల్యేపదవి ఎప్పుడు ఊడిపో తుందో అనే భయంతో ఆయన బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. తన పదవిని కాపాడుకునే ఆరాటంలో పడి ప్రజలను, ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించారు. ఫలితంగా ఖైరతాబాద్ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు అని విమర్శించారు.

# 1.120 కేజీల గంజాయి పట్టివేత

**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఎస్ ఎస్ బి గోల్డ్ ప్లాజా, మోండా మార్కెట్ సమీపంలో గంజాయి అమ్మకాలు జరుపుతున్న రాజేష్ కుమార్ తివారి అనే వ్యక్తిని సికింద్రాబాద్ డిటిఎఫ్ టీం సీఐ సౌజన్య సిబ్బంది కలిసి పట్టుకున్నారు. ఈ కేసులో1.120 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు వద్ద ఉన్నటువంటి టూ వీలర్ కూడా స్వాధీనం చేసుకున్నారు. రాజేష్ కుమార్ తివారి(35) బీహార్ కు చెందిన వ్యక్తి అతని పై కేసు నమోదు చేసి నిందితుని గంజాయిని టూవీలర్ను సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు సీఐ తెలిపారు. 650 గ్రాముల గంజాయి పట్టివేత.. హైదరాబాద్ (మెట్రో న్యూస్ ) వెస్ట్ బెంగాల్ కు చెందిన సూరత్ సింగ్ (24), శివ సింగ్ (20) లు వెస్ట్ బెంగాల్ నుంచి తీసుకు వచ్చిన గంజాయిని డ్రైవర్ గా పనిచేస్తున్న ఉప్పరీ గిరిధర్ (30) అనే వ్యక్తికి ఇచ్చి అమ్మకాలు చేపడుతున్నారు. ఉప్పరి గిరిధర్ గుల్లపోచంపల్లి ప్రాంతంలో గంజాయి అమ్మకాలు జరుపుతుండగా రంగారెడ్డి ఎన్ఫోర్స్మెంట్ బీ టీం సుభాష్ చంద్ర సిఐ సిబ్బంది కలిసి పట్టుకున్నారు. గంజాయి అమ్మకాలు జరుగుతున్న గిరిధర్ తో పాటు సూరత్ సింగ్ శివ సింగ్ గిరిధర్‌లను అరెస్ట్ చేసి మేడ్చల్ మల్కాజిగిరి ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు సీఐ సుభాష్ చంద్ర తెలిపారు.

**1.120 కేజీల గంజాయి పట్టివేత..**



సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఎస్ ఎస్ బి గోల్డ్ ప్లాజా, మోండా మార్కెట్ సమీపంలో గంజాయి అమ్మకాలు జరుపుతున్న రాజేష్ కుమార్ తివారి అనే వ్యక్తిని సికింద్రాబాద్ డిటిఎఫ్ టీం సీఐ సౌజన్య సిబ్బంది కలిసి పట్టుకున్నారు. ఈ కేసులో1.120 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు వద్ద ఉన్నటువంటి టూ వీలర్ కూడా స్వాధీనం చేసుకున్నారు. రాజేష్ కుమార్ తివారి(35) బీహార్ కు చెందినటువంటి వ్యక్తిపై కేసు నమోదు చేసి నిందితుని గంజాయిని టూవీలర్ను సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు సీఐ తెలిపారు.

**650 గ్రాముల గంజాయి పట్టివేత..** వెస్ట్ బెంగాల్‌కు చెందిన సూరత్ సింగ్ (24), శివ సింగ్ (20) అనే వెస్ట్ బెంగాల్ నుంచి తీసుకు వచ్చిన గంజాయిని డ్రైవర్ గా పనిచేస్తున్న ఉప్పరీ గిరిధర్ (30) అనే వ్యక్తికి ఇచ్చి అమ్మకాలు చేపడుతున్నారు. ఉప్పరి గిరిధర్ గుల్లపోచంపల్లి ప్రాంతంలో గంజాయి అమ్మకాలు జరుపుతుండగా



రంగారెడ్డి ఎన్ఫోర్స్మెంట్ బీ టిం సుభాష్ చంద్ర సిఐ సిబ్బంది కలిసి పట్టుకున్నారు. గంజాయి అమ్మకాలు జరుగుతున్న గిరిధర్ తో పాటు సూరత్ సింగ్ శివ సింగ్ గిరిధర్ లను అరెస్ట్ చేసి మేడ్చల్ మల్కాజిగిరి ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు సీఐ సుభాష్ చంద్ర తెలిపారు.

మెట్రో
3
హైదరాబాద్,
గురువారం,
మే 21, 2026

# నిప్పుల గుండం



**జిల్లా అంతటా 44 డిగ్రీల పైనే గరిష్ఠ ఉష్ణోగ్రతలు**
**జిల్లా అంతటా రెడ్ అలర్ట్**

నిజామాబాద్ (మెట్రోన్యూస్): జిల్లాపై భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 8 గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపుతుండడంతో ప్రజలు రోడ్లపైకి వచ్చేందుకు భయపడుతున్నారు. సాయంత్రం 6 గంటల వరకు ఎండ తీవ్రత ఉంటుంది. జిల్లా అంతటా రెడ్ అలర్ట్ వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. జిల్లాలోని 33 మండలాలలో అన్ని మండలాల్లో మంగళవారం 44డిగ్రీలపైనే గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా కమ్మర్‌పల్లి మండలంలో 45.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా పొతంగల్, సాలూర, ఎడపల్లి, నిజామాబాద్, ఆలూరు, మోర్తాడ్, భీంగల్, సిరికొండలలో 45 డిగ్రీలపైనే గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థమవుతుంది. కాగా, ఈ నెల 25 నుంచి [illegible] ప్రారంభమవుతుండడంతో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉందని అవసరమైతే తప్ప బయటకు రావద్దని వాతావరణశాఖ అధికారులు సూచిస్తున్నారు.

# సరస్వతి అంత్య పుష్కరాలకు
## ఏర్పాట్లు పూర్తి





వరంగల్, (మెట్రోన్యూస్) : సరస్వతి అంత్య పుష్కరాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. ఈ పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నామని వివరించారు. బుధవారం వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారి ఆలయంలో కంచి పీఠాధిపతి విజయేంద్రస్వామితో కలిసి కొండ సురేఖ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అల్వాల్ భూముల వ్యవహారంలో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్ల సస్పెన్షన్ అనంతరం దేవాలయం బయట మంత్రి కొండా సురేఖ విలేకర్లతో మాట్లాడుతూ..ఈ అంత్య పుష్కరాలకు రూ. 200 కోట్లకు పైగా నిధులు రాష్ట్ర ప్రభుత్వం కేటాయిం చిందని వివరించారు. రోజుకు ఒక స్వామీజీ స్నానంతో ఈ పుష్కరాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ పుష్కరాలు జరిగే ఈ పది రోజులు.. 10 మంది పీఠాధిపతులు వస్తారని వివరించారు. కాళేశ్వరంలో జరిగే ఈ సరస్వతి పుష్కరాల్లో ప్రతి రోజు సాయంత్రం గోదావరి హారతి ఇస్తారని చెప్పారు.అలాగే ఈ పుష్కరాల సందర్భంగా పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశామని కొండా సురేఖ వివరించారు. ఈ పుష్కరాల సందర్భంగా భక్తులకు పెద్ద ఎత్తున సేవలందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బాసర నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని భద్రాచలం వరకు దేవాలయాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు.గురువారం నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద సరస్వతి నది అంత్య పుష్కరాలు ప్రారంభం కానున్నాయి. మే 21 నుంచి జూన్ 1వ తేదీ వరకు మొత్తం 12 రోజుల పాటు ఈ అంత్య పుష్కరాలు జరుగనున్నాయి.

# భగీరథ ఎఫెక్ట్ బండి రాజకీయం

# కొల్లాజ్



**పావులు కదుపుతున్న రాష్ట్ర అగ్రనేతలు**
**కేంద్ర మంత్రి వర్గంలో సంజయ్‌కు డౌటే**

హైదరాబాద్ (మెట్రో న్యూస్ ): బండి భగీరథ్ పోక్సో కేసులో అరెస్ట్ కావడం బీజేపీ లో కలకలం రేపుతోంది. బీజేపీ లోని బీఆర్ఎస్ అనుకూల నేతల్లో పెరుగుతున్న ఆందోళన ఇందుకు అద్దం పడుతోంది.తెలంగాణ రాజకీయాల్లో బండి భగీరథ అరెస్ట్ అంశం ఇప్పుడు బీజేపీ అంతర్గత రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా గత కొంతకాలంగా బీఆర్ఎస్ తో ఎన్నికల సమయం నూ, ఆ పార్టీ అధికారం లో ఉన్న సమయంలో అంతర్గత సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారనే ప్రచారం ఎదుర్కొంటున్న బీజేపీ అగ్ర నేతలు ఈ పరిణామం తర్వాత అప్రమత్తమైనట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అలాగే భగీరథ్ అంశం కూడా బండి సంజయ్ మెడకు చుట్టు కుంటుందనే వాదన కూడా వినవస్తోంది. రోజుకో తీరుగా భగీరథ్ పై కేసులు పెంపు పెరగడం కూడా బండి సంజయ్ పదవికి పరోక్షంగా ముప్పుగా మారుతుందనే వాదన కూడా వినవస్తోంది.నిపార్టీ అధికారిక లైన్‌కు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై రాష్ట్ర నాయకత్వం ఇప్పటికే నిఘా పెట్టిందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. బండి భగీరథ వ్యవహారం తర్వాత "డబుల్ గేమ్" ఆడుతున్న నేతల జాబితాపై ఢిల్లీ స్థాయిలో కూడా చర్చ నడుస్తోందని సమాచారం.నిబీఆర్ఎస్ నాయకులతో కొందరు బీజేపీ నేతల సన్నిహిత సంబంధాలపై సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారం కూడా ఇప్పుడు మళ్లీ తెరపైకి వచ్చింది. ముఖ్యంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ, స్థానిక స్థాయిలో బీఆర్ ఎస్ నాయకత్వంతో సఖ్యత కొనసాగిస్తున్న నేతలపై క్రమశిక్షణ చర్యలు ఉండొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.నిరాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ, బీజేపీ బీఆర్ ఎస్ లు ప్రధానంగా పోరాటం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ అంతర్గతంగా బీఆర్ఎస్ అనుకూల వర్గాలు బలపడితే భవిష్యత్ రాజకీయ వ్యూహాలకు ఇబ్బందులు తలెత్తుతాయని అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది.బండి భగీరథ్ అరెస్ట్ విషయం లో బీఆర్ఎస్ ఆందోళన లు నిర్వహించగా పలు యూ ట్యూబర్లు విమర్శలు గుప్పించారు.ఈ నేపథ్యంలో బండి భగీరథ తండ్రి కేంద్ర మంత్రి బండి సంజయ్ నూ టార్గెట్ గా చేసుకొని బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేసినప్పటికి బీజేపీ నాయకులు అంతగా స్పందించలేదు. బీజేపీ అధ్యక్షులు రాంచందర్ రావు ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి లు స్పందించారు. బీజేపీ కి తెలంగాణ లో 8మంది ఎంపీ లు, 8మంది ఎమ్మెల్యే లు ఉన్నప్పటికీ రాకేష్ రెడ్డి మినహా మరెవ్వరు అంతగా స్పందించలేదు.నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ నూ ఓ మహిళా ఇదే అంశం పై ప్రశ్నించగా దాట వేసే మాటలు సోషల్ మీడియా లో చక్కర్లు కొడుతున్నాయి. అధికార కాంగ్రెస్ మాత్రం బండి భగీరథ విషయం లో బండి సంజయ్ కు మద్దతు తెలిపినట్టు ఆ పార్టీ నాయకుల మాటల వల్ల వెళ్ళడైంది. నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి భగీరథ్ అరెస్ట్, తండ్రిగా బండి సంజయ్ వ్యవహారం పై అనుకూల వ్యాఖ్యలు చేశారు. బీజేపీ కేంద్ర నాయకత్వం కూడా బండి సంజయ్ పట్ల సానుకూలంగా ఉన్నట్టు తెలుస్తోంది.

# కులగణనపై సుప్రీం తీర్పు పై కాంగ్రెస్ హర్షం

హైదరాబాద్ (మెట్రో న్యూస్): జనగణనలో కులగణన చేపట్టాలన్న సుప్రీం కోర్ట్ తీర్పు పై తెలంగాణ కాంగ్రెస్ హర్షం వ్యక్తం చేసింది. జనగణనలో కుల గణన చేపట్టాలన్న సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్టు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఒక ప్రకటన లో తెలిపారు.దేశంలోని సామాజిక, ఆర్థిక అసమానతలను సరిచేయడానికి కుల గణన అత్యంత అవసరమని కాంగ్రెస్ పార్టీ ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తోందని తెలిపారు.కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా దేశవ్యాప్తంగా కుల గణన అవసరాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారని, సామాజిక న్యాయం సాధనకు కుల గణన కీలకమని స్పష్టం చేశారని పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాలకు వారి జనాభా ప్రాతిపదికన న్యాయం జరగాలంటే సమగ్ర కుల గణన తప్పనిసరి అని కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడు తోందన్నారు.



# మూసీ,మెట్రో రైల్ ప్రాజెక్టులకు సానుకూలం

## కేంద్ర మంత్రి ఖట్టర్‌తో కిషన్ రెడ్డి భేటీ

ఢిల్లీ (మెట్రో న్యూస్): తెలంగాణకు సంబంధించిన రెండు కీలక ప్రాజెక్టుల విషయంలో కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. మూసీనది పారిశుద్ధం, మెట్రో రైల్ రెండో దశ ప్రాజెక్టులకు సంబంధించి బుధవారం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో కిషన్ రెడ్డి భేటీ అయ్యారు. సమావేశం అనంతరం కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరంలో కొనసాగుతున్న వివిధ కీలక ప్రాజెక్టులపై వారితో కలిసి సమీక్ష జరిగిందని చెప్పారు. ఈ సందర్భంగా నగరాభివృద్ధి, మౌలిక వసతులు, పారిశుద్ధం, ప్రజా రవాణాకు సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై విస్తృతంగా చర్చించినట్టు తెలిపారు. ముఖ్యంగా భాగ్యనగరంలోని మూసీనది పారిశుద్ధ్యానికి కేంద్రం సహకరిస్తోందన్నారు. మూసీనదిలో కలుస్తున్న మురుగు నీటిని శుద్ధి చేసేందుకు రూ. 3,975 కోట్ల వ్యయంతో మొత్తం 39 సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను మంజూరు చేశామన్నారు.

# రూ 5 వేల కోట్లు ఇవ్వండి



**ఆర్థిక మంత్రి నిర్మలకు డిప్యూటీ సీఎం భట్టి వినతి**

ఢిల్లీ (మెట్రో న్యూస్): తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యి రాష్ట్ర అభివృద్ధి, విద్యా మౌలిక వసతులు, మూలధన వ్యయాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రా(ష్ట్రాలకు ఇచ్చే ప్రత్యేక నిధుల పథకం కింద తెలంగాణకు అదనంగా రూ.5,000 కోట్ల ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయాలని కోరారు. రాష్ట్రంలో విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతులు, మానవ వనరుల అభివృద్ధి రంగాల్లో ప్రభుత్వం చేపడుతున్న భారీ పెట్టుబడులు, సంక్షేమ కార్యక్రమాలను కేంద్ర ఆర్థిక మంత్రికి వివరించారు. అలాగే, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ సహా విద్యా రంగంలో చేపడుతున్న భారీ పెట్టుబడులకు సంబంధించి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ అఫైర్స్ ఆమోదించిన విదేశీ ద్రవ్య సహకార ప్రాజెక్టులకు ఎఫ్ఆర్ఎంబీ పరిమితుల నుంచి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ సీఎం వెంట ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ప్లానింగ్ డిపార్ట్మెంట్ సెక్రటరీ గౌరవ ఉప్పల్ తదితరులు ఉన్నారు.

# జన గణనలో కులగణన వద్దంటూ 'పిల్'

## కొట్టేసిన సుప్రీం కోర్టు



ఢిల్లీ (మెట్రో న్యూస్): జన గణనలో కుల గణన మినహాయించేలా ఆదేశాలు ఇవ్వాలన్న పిల్ను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఏజెన్సీలు కులగణన సమాచరాన్ని దుర్వినియోగం చేసే అవకాశం ఉందని సర్వోన్నత న్యాయస్థానంలో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. పిల్‌పై విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం... పిటిషన్ కొట్టివేస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. జనగణన కుల ప్రాతిపదికన ఉండాలా? వద్దా? అనేది విధానపరమైన నిర్ణయం. వెనుకబడిన తరగతుల జనాభా ఎంత ఉందో ప్రభుత్వం తెలుసుకోవాలి కదా. ఇది.. విధానపరమైన విషయం.. ఇందులో జోక్యం చేసుకోవడానికి కారణం కనిపించడంలేదు అంటూ పిటిషన్ ను ధర్మాసనం కొట్టివేసింది

## తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

**కరీంనగర్ రీజనల్ మేనేజర్ కత్తి శ్రీనివాస్**

**వెన్నంపల్లిలో నూతనశాఖ ప్రారంభం**



సైదాపూర్, మెట్రో న్యూస్తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలను రైతులు, వ్యాపారులు, సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు కరీంనగర్ రిజనల్ మేనేజర్ కత్తి శ్రీనివాస్ పేర్కొన్నారు. సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి గ్రామంలో బుధవారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు నూతనశాఖను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పరిచయ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ...వ్యవసాయం, వ్యాపారం, విద్య, గృహ నిర్మాణం, వాహనాల కోనుగోలుకు రుణ సదుపాయం, భీమా పథకాలు, ప్రభుత్వ సబ్సిడీ పథకాలు, రుణం సదుపాయం, ఇతర బ్యాంకు సేవలపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ నాగేంద్ర, సీనీయర్ మేనేజర్ ఆపరేషన్స్ సుబ్బారావు, సీనియర్ మేనేజర్ బిజినెస్ వంశికృష్ణ, ఉప్పల్ బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్వర్లు, జమ్మికుంట బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్ రాజు, వెన్నేపల్లి విశాల పరపతి సహకార సంఘం పర్సన్ ఇంచార్జీ కొత్త తిరుపతి రెడ్డి, మాజీ ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్లు మ్యాకల స్వప్న, కందుల అనిత, వర్నే లావణ్య, మొలుగూరి చిరంజీవి, ఉపసర్పంచ్లు అందె రాకేష్, వెంగల రవి, రైతులు, వ్యాపారస్తులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదును సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**




మెట్రో న్యూస్ పెద్దపల్లి బ్యూరో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లాలోని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని సామాజిక సేవలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్లమెంట్ యాక్ట్ ద్వారా ఏర్పాటు చేయబడిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అత్యంత ప్రతిష్టాత్మకమైనదని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మార్గదర్శనంలో, రాష్ట్ర చైర్మన్ దాన కిషోర్ నాయకత్వంలో ఈ సంస్థ బహుముఖ సేవలందిస్తూ అతి పెద్ద సామాజిక సంస్థగా గుర్తింపు పొందిందని కలెక్టర్ వివరించారు. మే 15 నుండి జూన్ 15, 2026 వరకు ఈ ప్రత్యేక సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించబడుతుందని ఆయన వెల్లడించారు. రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ప్రకృతి విపత్తుల సమయంలో తక్షణ సహాయం అందించడం, ఉచిత స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు నిర్వహించడం, క్యాన్సర్, సికిల్ సెల్, తలసేమియా రోగులకు ఉచితంగా రక్తాన్ని సరఫరా చేయడం వంటి ఎన్నో ఉత్కృష్టమైన సేవలు అందుతున్నాయని చెప్పారు. వీటితో పాటు సీనియర్ సిటిజన్స్ హోమ్స్, అనాథ శరణాలయాలు, ఉచిత ప్రసూతి వైద్యశాలల నిర్వహణ వంటి అద్భుతమైన సామాజిక కార్యకలాపాలు ఈ సంస్థ ద్వారా జరుగుతున్నాయని కలెక్టర్ కొనియాడారు. ఈ కార్యక్రమం సందర్భంగా పెద్దపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కనుకుంట్ల సదానందంకు రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ కార్డును జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి భారతీయ పౌరుడు ఈ సంస్థలో సభ్యుడిగా చేరుటకు అర్హుడని స్పష్టం చేశారు. ఆసక్తి గల పౌరులు ఆన్‌లైన్ ద్వారా జీవిత కాల సభ్యులుగా లేదా వైస్ ప్యాట్రన్, ప్యాట్రన్ సభ్యునిగా చేరవచ్చని సూచించారు. సభ్యత్వ నమోదు కొరకు పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో పాటు, గుర్తింపు కార్డుల కొరకు ఆధార్ కార్డు, ఓటర్ ఐడి కార్డ్ లేదా పాన్ కార్డ్ అవసరమవుతాయని తెలిపారు. సభ్యులుగా చేరదలచిన వారు అధికారిక వెబ్సైట్ హ్ట్రజూం://తీవఎ-ఎతీశీఎం.ఎస్ర్తస్ర్త.స్త్రశీజ.ఱఅ/ ద్వారా గానీ, లేదా గూగుల్ ప్లే స్టోర్ నుండి 'ఎవశ్రీఖఅస్త్రుఖు =వఎ జతీశీం' మొబైల్ యాప్ డౌన్లోడ్ చేసుకుని గానీ తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ వివరించారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు నోడల్ ఆఫీసర్లుగా జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్, ప్రాజెక్ట్ డైరెక్టర్ గ్రామీణ అభివృద్ధి అధికారిని నియమించామని, వారి కార్యాలయాల్లో ప్రత్యేకంగా డాటా సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని వెల్లడించారు. జిల్లా అడిషనల్ కలెక్టర్, రెడ్ క్రాస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రెగ్యులర్ గా సమీక్షిస్తారని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇదే సందర్భంలో జిల్లా యువజన క్రీడా శాఖ కార్యాలయంలో రూపొందించిన జిల్లా టూరిజం గైడ్ పోస్టర్ ను జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో బీసీ సంక్షేమ శాఖ అధికారి రంగారెడ్డి, ఉపాధి కల్పనాధికారి రాజశేఖర్, సహాయ కార్మిక అధికారి మహమ్మద్ రఫీ, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు కావేటి రాజగోపాల్ పాల్గొన్నారు.

# ధాన్యం నిల్వ చేసేందుకు గోదాంలను సిద్ధం చేయాలి



రాజన్న సిరిసిల్ల, మెట్రో న్యూస్ :ధాన్యం నిల్వ చేసేందుకు జిల్లాలో అందుబాటులో ఉన్న గోదాంలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ధాన్యం సేకరణ, గోదాంల వినియోగం, తూకం వేసిన బస్తాల తరలింపు, వాహనాలు, హమాలీల సంఖ్య పెంపు, మిల్లుల్లో ధాన్యం అన్ లోడింగ్, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ వేగవంతం చేయడం, సన్న రకాల సాగుపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడం, తదితర అంశాలపై బుధవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాల, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ,ఖ మెప్మా, వ్యవసాయ, తదితర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో ఇప్పటి వరకు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగుతుందని, చివరి గింజ వరకు కొనుగోలు చేసేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని, రైతులకు క్షేత్ర స్థాయిలో భరోసా కల్పించాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రోజువారీగా సేకరణలో పురోగతి పెంచడంపై దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఉన్న గోదాంలను వినియోగంలోకి తీసుకువచ్చి, ధాన్యం నిల్వ చేసేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. తూకం వేసిన ధాన్యం బస్తాలను వాహనాల ద్వారా తరలించడం, దీని కోసం సరిపడా వాహనాలు సమకూర్చేలా సంబంధిత ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. హమాలీల సంఖ్యను మరింత పెంచి ధాన్యం లోడింగ్, మిల్లులు, అపరల్ పార్కులో అన్ లోడింగ్ చేయడంలో వేగం పెంచాలని ఆదేశించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి సంబంధించి ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు. సన్న రకం వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, వచ్చే సీజన్ లో రైతులు సన్న రకం వరి సాగు చేసేలా సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో అవగాహన, విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. అకాల వర్షాలు పడితే ఇబ్బందులు కలగకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, త్వరితగతిన ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులు పని చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

## కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి ఘనంగా నిర్వహించిన సీఐటీయూ నాయకులు



వేములవాడ, మెట్రో న్యూస్ : వేములవాడ పట్టణంలో సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సీఐటీయూ) వేములవాడ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సీఐటీయూ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎగ్మంటి ఎల్లారెడ్డి మాట్లాడుతూ కామ్రేడ్ సుందరయ్య బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడారని అన్నారు. కార్మిక వర్గానికి కనీస వేతనాలు అమలు చేయించడం, కార్మిక చట్టాల పరిరక్షణలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ప్రస్తుతం కూడా సీఐటీయూ తెలంగాణ కమిటీ ఆధ్వర్యంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. సుందరయ్య ఆశయ సాధన కోసం పోరాటాలు కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం అశోక్, సీపీఎం వేములవాడ పట్టణ కార్యదర్శి ముక్తికాంతం అశోక్, ఎస్ఎఫ్ఐ నాయకులు మల్లారపు అరుణ్ కుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు హనుమంతు, మున్సిపల్ యూనియన్ నాయకులు సావనపల్లి శ్రీనివాస్, కీసర శ్రీనివాస్, బొట్టు శ్రీనివాస్, బొడ్డు శ్రీనివాస్, పిట్టల శంకర్, సిహెచ్ అనిల్, నిమ్మచెట్టి రాజశేఖర్, జంగా రాజు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి



కరీంనగర్, బ్యూరో మెట్రో న్యూస్ మండలంలోని కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ డాక్టర్ సనా జవేరియా ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు, రికార్డుల నిర్వహణ, హాజరు రిజిస్టరు, ఎన్ సి డి రిజిస్టర్ ,ఫార్మసీ స్టోర్ , ఓపి రిజిస్టర్ ,సిబ్బంది పనితీరు తదితర అంశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అర్బన్ హెల్త్ సెంటర్ విద్యానగర్‌ను కూడా సందర్శించి అక్కడ జరుగుతున్న హెచ్పీవీ (హ్పఎ) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పద్నాలుగు సంవత్సరాలు నిండిన బాలికలందరూ తప్పనిసరిగా హెచ్పీవీ వ్యాక్సిన్ వేయించుకోవాలని కోరారు. ఈ వ్యాక్సిన్ ద్వారా భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ నివారణకు సహాయపడుతుందని తెలిపారు. మహిళా సంఘ సభ్యులతో సమావేశమై ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో ప్రజలు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకుని సమయానికి వైద్య సేవలు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాజియా ఫాతిమా,డాక్టర్ సాహితీ మరియు వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## విలువైన ప్రభుత్వ భూమిని పరిరక్షించిన అధికారులు

**అన్యాక్రాంత చర్యలపై కఠిన హెచ్చరిక**



హనుమకొండ జిల్లా బ్యూరో చీఫ్ మెట్రో ఈవినింగ్ న్యూస్ మే (20) హనుమకొండ జిల్లా కాజీపేట్ మండలం శాయంపేట్ గ్రామ పరిధిలోని సర్వే నెం. 23లో ఉన్న విలువైన ప్రభుత్వ బంచరాయి భూమిని అధికారులు సమన్వయంతో పరిరక్షించినట్లు కాజిపేట తహశీల్దార్ రాజు నేడోక ప్రకటనలో తెలిపారు. సదరు భూమిలో గతంలో అక్రమ మైనింగ్ నిర్వహించబడటంతో భారీ గుంతలు ఏర్పడి భూమి నిరుపయోగ స్థితికి చేరుకుంది. అనంతరం భద్రకాళి చెరువు పూడిక మట్టిని వినియోగించి ఆ గుంతలను పూడ్చి, ప్రజాప్రయోజనార్థం ఉపయోగపడే విధంగా భూమిని అభివృద్ధి చేయడం జరిగినది. అయితే, కొంతమంది వ్యక్తులు సంబంధిత అధికారుల నుండి ఎటువంటి ముందస్తు అనుమతులు పొందకుండా దేవాలయం పేరుతో ఆ విలువైన ప్రభుత్వ భూమిని చట్టవిరుద్ధంగా ఆక్రమించేందుకు ప్రయత్నించినట్లు గుర్తించబడింది. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన రెవెన్యూ శాఖ అధికారులు, పోలీస్ శాఖ, జి.డబ్ల్యూ.ఎం.సి డీఆర్ఎఫ్ బృందం, టౌన్ ప్లానింగ్ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో తక్షణ చర్యలు చేపట్టి ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం కాకుండా రక్షించారు. అధికారుల అప్రమత్తతతో ప్రజా ఆస్తి పరిరక్షించబడినది. అదేవిధంగా, సంబంధిత వ్యక్తులు ప్రభుత్వ భూమిపై అక్రమ కబ్జాకు యత్నించడమే కాకుండా, అక్కడ వివాదాస్పద పరిస్థితులు సృష్టించి ప్రజలకు అసౌకర్యం కలిగించిన నేపథ్యంలో, వారి పై సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 19వ తేదీన కేసు నమోదు చేయబడినది. కావున, ఇకముందు ఎవరైనా ప్రభుత్వ భూములపై ఆక్రమణలు, అన్యాక్రాంత చర్యలు లేదా చట్టవిరుద్ధ నిర్మాణాలకు పాల్పడినచో సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయని తహశీల్దార్ హెచ్చరించారు.

# కటాక్షాపూర్ త్రికూట దేవాలయాల్లో ఘనంగా "హెరిటేజ్ వాక్"

**కాకతీయుల చారిత్రక వారసత్వ పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్న ప్రజాప్రతినిధులు**

**కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**




హనుమకొండ జిల్లా బ్యూరో చీఫ్ మెట్రో ఈవినింగ్ న్యూస్ మే (20) హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం పరిధిలోని చారిత్రక కటాక్షాపూర్ హెరిటేజ్ త్రికూట దేవాలయాల వద్ద తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక "99 రోజుల కార్యాచరణ ప్రణాళిక ఉ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం "హెరిటేజ్ వాక్" కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పర్యాటక శాఖ సిబ్బంది, స్థానిక నాయకులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పర్యాటక జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కటాక్షాపూర్ త్రికూటాలయం పరిసరాల్లో నిర్వహించిన హెరిటేజ్ వాక్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని దేవాలయ చారిత్రక విశిష్టతను పరిశీలించారు. ఈ సందర్భంగా త్రికూటాలయంలో నిర్వహించిన సభలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ కాకతీయుల కాలం నాటి చారిత్రక నిర్మాణాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలని అన్నారు. అలాంటి వారసత్వ కట్టడాలను పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కటాక్షాపూర్ త్రికూట దేవాలయం అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం తరపున ఆర్థిక సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలు ఎంతో బాధ్యతతో ఆలయాన్ని సంరక్షిస్తున్నారని ప్రశంసించారు. అలాగే ఆలయ ప్రవేశద్వారం వద్ద ఆర్చ్ నిర్మాణం చేపట్టేందుకు జిల్లా అధికారులతో సమన్వయం చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ చారిత్రక వారసత్వాన్ని కేవలం సంరక్షించడం మాత్రమే కాకుండా పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయడం ద్వారా యువతకు చరిత్రపై అవగాహన పెంపొందుతుందని అన్నారు. కటాక్షాపూర్ ప్రాంతాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రముగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ కాకతీయుల నిర్మాణ శైలి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిందని పేర్కొన్నారు. ప్రజాపాలన కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న చారిత్రక సంపదను ప్రజలకు పరిచయం చేయడం అవసరమని అన్నారు. కటాక్షాపూర్ త్రికూట దేవాలయం చారిత్రకంగా ఎంతో విలువైనదని, దీనిని పరిరక్షించేందుకు సంబంధిత శాఖలతో కలిసి చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎం. శివాజీ మాట్లాడుతూ జిల్లాలోని పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కటాక్షాపూర్ త్రికూటాలయంలో పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు సమీప చెరువులో బోటింగ్ వంటి ఆకర్షణీయమైన కార్యక్రమాలు ప్రారంభించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక వారసత్వాన్ని భావితరాలకు అందించాలనే లక్ష్యంతో "హెరిటేజ్ వాక్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధికి కట్టుబడి ఉందని, కటాక్షాపూర్ వంటి చారిత్రక ప్రాంతాలను రాష్ట్ర పర్యాటక పటంలో ప్రముఖ స్థానం కల్పించే దిశగా చర్యలు కొనసాగుతాయని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుడా పిఓ అజిత్ రెడ్డి, టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ సూర్య కిరణ్ పర్యాటక ప్రేమికులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కాంగ్రెస్ నిరసన

**మోదీ దిష్టిబొమ్మ దగ్ధం చేసి**

**ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ శ్రేణులు..**




హన్మకొండ టౌన్ మే :20 (మెట్రోన్యూస్) పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలకు నిరసనగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. హనుమకొండ డీసీసీ భవన్ నుంచి అశోక జంక్షన్ వరకు మోదీ దిష్టిబొమ్మతో ర్యాలీ నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఎన్నికలు పూర్తైన వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రజలపై అదనపు భారం మోపిందని విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గుతున్నప్పటికీ దేశంలో ఇంధన ధరలు పెరగడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చేందుకు సామాన్య ప్రజల జేబులు ఖాళీ చేస్తోందని ఆరోపించారు. పెరిగిన ఇంధన ధరల ప్రభావం అన్ని నిత్యావసర వస్తువుల ధరలపై పడుతూ మధ్యతరగతి, పేద ప్రజల జీవనాన్ని మరింత భారంగా మారుస్తోందని పేర్కొన్నారు. రైతు నుంచి ఆటో డ్రైవర్ వరకు ప్రతి వర్గం ఈ ధరల పెరుగుదలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. "అచ్చే దిన్" పేరుతో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రజలకు "భారాల దిన్" చూపిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై పోరాటం చేస్తుందని, పెంచిన ఇంధన ధరలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆవేదనను కేంద్ర ప్రభుత్వం అర్థం చేసుకుని ధరలు తగ్గించే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మాజీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, పోతుల శ్రీమాన్, మాధవి, జిల్లా మహిళా అధ్యక్షురాలు బంక సరళ, నాయకులు నాయిని లక్ష్మా రెడ్డి, బంక సంపత్, తౌటం రవీందర్, అలువాల కార్తీక్, తోట పవన్, గుంటి స్వప్న, సాగరిక డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెట్రో ఈవినింగ్స్
METRO EVENINGS
నల్గొండ-ఖమ్మం
సూర్యపేట | కొత్తగూడెం
యాదాద్రి భువనగిరి | భద్రాద్రి
epaper.metroevenings.com
తేది : గురువారం, మే 21 2026
పేజ్ నెం. : 6

## జిల్లాలోని వివిధ విద్యాసంస్థల్లో కొనసాగుతున్న సివిల్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్అనురాగ్ జయంతి**



కలెక్టరేట్ మెట్రో న్యూస్ ; బుధవారం మినీ మీటింగ్ హాల్ లో జిల్లా పరిధిలోని పీఎం శ్రీ పాఠశాలలు, కేజీబీవీలు, భవిత కేంద్రాలు, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, సంక్షేమ హాస్టళ్లలో జరుగుతున్న నిర్మాణ, మరమ్మతు పనుల పురోగతిని పై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర రావుతో కలిసి కలెక్టర్హాసమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అన్ని మరమ్మతుల పనులు, కేజీబీవీల నాబార్డ్ పనులు, సివిల్ రిపేర్లు పనులు పూర్తిచేసి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను కూడా వచ్చే నెలలో పూర్తి అయ్యేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నిర్మాణాల్లో ఎలాంటి లోపాలు లేకుండా ఇంజినీరింగ్ అధికారులు తరచూ పర్యవేక్షణ నిర్వహించాలని తెలిపారు. ప్రతి పనికి గడువులు నిర్ణయించి నిరంతరంగా మానిటరింగ్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎంప్లాయిమెంట్ మరియు బీసీ సంక్షేమ అధికారిహాసాహితీ, ౧+జుఔ×ణజ డి.ఈ. శివకుమార్, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ ఈఈహాదాసయ్య, జిల్లా విద్యాశాఖ ఇంచార్జ్ అసిస్టెంట్ డైరెక్టర్హాశ్రీనివాసరావు, ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీహరి అయ్యంగార్, ౧+జుఔ×ణజ ఏఈలు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలి.

**సర్ కు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి - జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్.**



నల్గొండ బ్యూరో, మెట్రో న్యూస్ ఎస్ ఐ ఆర్ ప్రక్రియను ఎన్నికల నియమ నిబంధనలకు లోబడి ఆదర్శవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ 2002 నాటి ఓటరు జాబితా ఆధారంగా ప్రస్తుతం ఆ ఓటర్ల పరిస్థితి, 2002 తర్వాత కొత్తగా జాబితాలో చేరిన వారి అంశాలను పరిశీలిస్తూ 2026 ఓటరు మ్యాపింగ్ చేపట్టాలని తెలిపారు. ఇప్పటివరకు 80.65 శాతం ప్రక్రియ పూర్తయిందని, తక్కిన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సుమారు 10 శాతం మంది వచ్చిన వారి వివరాలను సేకరించి ధృవీకరణ చేపడతామని చెప్పారు. ఈ ప్రక్రియ కై 1575 మంది బీఎల్ఓలను నియమించామని, అన్ని రాజకీయ పార్టీల నుండి బీఎల్ఏలుగా ప్రతినిధులను నియమించాలని, వారి వివరాలను వీలైనంత త్వరగా అందిస్తే మ్యాపింగ్ ప్రక్రియ మరింత వేగవంతమవుతుందని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ 2 ఫారాలు అందజేస్తామని, ఓటర్లు ఒక దానిని పూరించి సమర్పించాలని చెప్పారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు విధానాల్లో అవకాశం కల్పించామని వివరించారు. ఓటరు గుర్తింపు కోసం ఎన్నికల సంఘం సూచించిన 12 రకాల ధృవీకరణ పత్రాలలో ఏదైనా ఒకటి సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. డబుల్ ఓట్లు లేకుండా ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, మార్పులు అవసరమైతే ఫారంఉ8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. 01-10-2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తిచేసుకునే యువత ఓటరుగా నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మ్యాపింగ్ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించిన కలెక్టర్, త్వరలో బిఎల్ఓలు మరియు బీఎల్ఏలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పూర్తి స్థాయి అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఓటరు జాబితాకు సంబంధించిన సమస్యలు ఉంటే జిల్లా ఎన్నికల అధికారిని ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నుండి ముంతాజ్ ఎంఐఎం నుండి రజియోద్దీన్, బిఆర్ఎస్ పార్టీ నుండి పంకజ్ యాదవ్, బిజెపి తరఫున లింగస్వామి, టిడిపి మల్లికార్జున్, బహుజన సమాజ్ పార్టీ రవికుమార్, యాదగిరి ,సిపిఎం నుండి నర్సిరెడ్డి ఆఫ్ పార్టీ అన్సారి, తదితరులు పాల్గొన్నారు.

## పక్కా ఓటర్ల జాబితా తయారే లక్ష్యం

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



మెట్రో న్యూస్, సూర్యాపేట ప్రతినిధి: ఎలాంటి తప్పులు లేని, అత్యంత పారదర్శకమైన పక్కా ఓటర్ల జాబితాను రూపొందించడమే జిల్లా యంత్రాంగం రాజకీయ పార్టీల ముఖ్య లక్ష్యం కావాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై జిల్లా స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ వీసీ సమావేశ మందిరంలో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం జిల్లా యంత్రాంగం అత్యంత పారదర్శకంగా, ఖచ్చితమైన విచారణతో బాధ్యతాయుతంగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. రాజకీయ నాయకులు సైతం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలన చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందుకోసం ప్రతి రాజకీయ పార్టీ తక్షణమే తమ బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించి, ప్రజాస్వామ్య బలోపేతంలో భాగస్వాములు కావాలని, అధికారులతో రాజకీయ నాయకులు నిరంతరం సమన్వయం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం జూన్ 15నుండి ప్రారంభం అవుతుందని, జూన్ 15 నుండి 24 వరకు బూత్ స్థాయి అధికారులకు పూర్తిస్థాయి శిక్షణ, ప్రిపరేషన్, ప్రింటింగ్ జూన్ 25 నుండి జూలై 24వ తేదీ వరకు బిఎల్ఓలచే ఇంటింటికీ వెళ్లి సమగ్ర విచారణ, జులై, 24 న పోలింగ్ కేంద్రాలను ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరించటం, జూలై 31న ఓటర్ల ముసాయిదా (డ్రాఫ్ట్) జాబితా ప్రచురణ, జూలై 31 నుండి ఆగస్టు 30వ తేదీ వరకు ముసాయిదాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ, జులై, 31 నుండి సెప్టెంబర్, 28 వరకు అభ్యంతరములు అభ్యంతరముల పరిష్కారం, అక్టోబర్, 1న ఓటర్ల తుది జాబితా అధికారిక ప్రచురణ చేయడం జరుగుతుందని వివరించారు.

**బీఎల్ఓల పాత్ర అత్యంత కీలకం**

కొత్త ఓటర్ల నమోదు, జాబితా ప్రక్షాళనలో బూత్ స్థాయి అధికారుల పాత్ర అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. బీఎల్ఓలు ప్రతి ఇంటికీ వెళ్లి క్షుణ్ణంగా విచారణ చేసిన అనంతరం మాత్రమే కొత్త ఓటరు నమోదు ప్రక్రియ చేపడతారని, స్థానికంగా చనిపోయిన వారి పేర్లను తొలగించడం, వలస వెళ్లిన వారిని గుర్తించడంతో పాటు అర్హులైన కొత్త ఓటరు ఎవరూ కూడా జాబితాలో చేర్చే బాధ్యత బీఎల్ఓలపై ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. కొత్తగా ఏర్పాటు చేసే పోలింగ్ కేంద్రాల నియమ నిబంధనలపై కలెక్టర్ స్పష్టతనిచ్చారు. ప్రతి కొత్త పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1200 మంది ఓటర్లు మాత్రమే ఉండాలని, ఓటరు తన ఓటు హక్కును వినియోగించు కోవడానికి 2 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ప్రయాణించకుండా ఉండేలా వీలైనంత సమీపంలోనే కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 1-10-2026 నాటికి 18 సంవత్సరాల వయస్సు నిండే ప్రతి యువతీ యువకుడు తప్పనిసరిగా ఫామ్-6 ద్వారా కొత్త ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అలాగే ఓటర్ల జాబితాలో తప్పుల సవరణలు, మార్పులు, చేర్పుల కోసం ఫామ్-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఒక దృఢమైన ప్రజాస్వామ్య నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు నమోదు ప్రక్రియలో సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి, హరి సింగ్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు కాంగ్రెస్ నాయకులు చకిలం రాజేశ్వర రావు, బిజెపి నాయకులు ఎం డి, అజిద్, సిపిఎం నాయకులు వి రవి, బిఆర్ ఎస్ నాయకులు కె, కరుణాకర్, ఎలక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# బిల్డింగ్ యజమానులు, కాంట్రాక్టర్లు సహకరించాలి

**డివిజన్ ప్లంబర్స్ యూనియన్ అధ్యక్షులు రాచకొండ నాగరాజు**



మెట్రో న్యూస్,(మే20) సూర్యాపేట ప్రతినిధి: పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల దృష్ట్యా తమ కుటుంబ పోషణకు అవసరమైన విధంగా ధరలను నేటి నుంచి పెంచడం జరిగిందని, బిల్డర్లు, బిల్డింగ్ యజమానులు, కాంట్రాక్టర్లు సహకరించాలని సూర్యాపేట డివిజన్ ప్లంబర్స్ యూనియన్ అధ్యక్షులు రాచకొండ నాగరాజు అన్నారు. బుధవారం ప్లంబర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మే 17 నుంచి 20 వరకు బంద్ నిర్వహించామని తెలిపారు. పట్టణంలోని పలు కూడళ్లలో బైక్ ర్యాలీ నిర్వహించారు. గత మూడేళ్లుగా తమ యూనియన్ ధరలను పెంచలేదని, అదే విధంగా తమకు వచ్చే అరకొర డబ్బులతో కనీసం వర్కర్లకు కూలీ ఇవ్వలేకున్నామని, ప్రస్తుత పరిస్థితుల్లో పెరిగిన నిత్యావసర పరిస్థితులకు అనుగుణంగానే రేట్లను పెంచడం జరిగిందన్నారు. గురువారం నుంచి పెంచిన ధరలు అమలు పరచడం జరుగుతుందని తెలిపారు. ఈ ర్యాలీలో గౌరవ అధ్యక్షులు కోట పరుశరాములు, గౌరవ సలహాదారులు గంగాధరి మల్లయ్య, ఉపాధ్యక్షులు గొట్టిపర్తి వెంకన్న, ప్రధాన కార్యదర్శి శనగాని రవీందర్, కోశాధికారి లింగంపల్లి సైదులు, సహాయ కార్యదర్శి మెంతెబోయిన మల్లేష్ పాల్గొన్నారు.


## మెడికల్ షాపుల బంద్ సంపూర్ణం..

**-ఈ ఫార్మసీ అక్రమ విధానాన్ని నిలిపివేయాలి..**

**-ఫార్మసీ రక్షణ.ప్రజా ఆరోగ్య పరిరక్షణ కోసంమే మాశాంతియుత ఉద్యమం**

**-కెమిస్టను కాపాడు కుందాం ఆరోగ్య రంగాన్ని రక్షించుకుందాం..**

**-బంద్ అంశంపై వివరాలు వెల్లడించిన కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అధ్యక్ష కార్యదర్శులు హరగోపాల్, మౌలాలి..**



ఖమ్మంమెట్రో ఈవెనింగ్ మే 20ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ & డ్రగ్గిస్ట్స్ (ఌ×ౠజణ) పిలుపుమేరకు ఖమ్మం జిల్లాలో మెడికల్ షాపులు, కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ డిస్ట్రిబ్యూటర్లు బుధవారం ఒక్కరోజు బంద్ నిర్వహించారు. ఈవాందర్భంగా ది ఖమ్మం డిస్ట్రిక్ కెమిస్ట్స్ అండ్ డ్రగిస్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరగోపాల్, షేక్ మౌలాలి, కోశాధికారి రాజారావు లు ముస్సిఫ్ టీవీ తో మాట్లాడారు. ఫార్మసీ రక్షణ కోసం, ప్రజా ఆరోగ్య పరిరక్షణ కోసం కెమిస్టను కాపాడాలని, అక్రమ ఈ-ఫార్మసీలకు నో చెప్పాలని, ప్రజా ఆరోగ్యాన్ని కాపాడటానికి, న్యాయమైన వ్యాపార విధానాలను అమలు చేయడానికి 12.40 లక్షల కెమిస్టులు, 4-5 కోట్ల అధారితుల జీవనోపాధిని రక్షించడానికి శాంతియుత నిరసనలో భాగంగా ఒక్కరోజు బంద్ ను విజయవంతంగా ముగించామని తెలిపారు. ప్రెస్క్రిప్షన్ లేకుండా మందుల విక్రయం జరుగుతుందన్నారు ప్రెస్క్రిప్షన్ల దుర్వినియోగంజరుగుంతుందని వారు ఆరోపించారు. మా ప్రస్తుత వ్యవస్థ సరైన మందు సరైన రోగికి చేరేలా చూస్తుందని, ఈ వ్యవస్థలో ఏ మార్పు జరిగినా ప్రజా ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం ఉంటుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నగర, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ఖమ్మం ఖిల్లాలో ఘనంగా హెరిటేజ్ వాక్ నిర్వహణ...

**జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి తుంబురు సునీల్ రెడ్డి**
**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పర్యాటక ఉత్సవాలు**
**ఖిల్లా చారిత్రక ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పన**
**పర్యాటక అభివృద్ధికి హెరిటేజ్ కార్యక్రమాలు దోహదం చేస్తాయి**
**జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హెరిటేజ్ వాక్ విజయవంతం**




ఖమ్మం మెట్రో ఈవెనింగ్ మే 20:ఖమ్మం ఖిల్లాలో హెరిటేజ్ వాక్ కార్యక్రమం ఘనంగా నిర్వహించామని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి తుంబురు సునీల్ రెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం ఖమ్మం ఖిల్లాలో నిర్వహించిన హెరిటేజ్ వాక్ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి తుంబురు సునీల్ రెడ్డి పాల్గొన్నారు. జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి తుంబురు సునీల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 18 నుండి మే 23 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న పర్యాటక ఉత్సవాల నేపథ్యంలో ఖమ్మం ఖిల్లా నుండి జాఫర్ బావి వరకు హెరిటేజ్ వాక్ నిర్వహించామని తెలిపారు. ఖమ్మం ఖిల్లా మెట్లు వద్ద ప్రారంభమైన ఈ హెరిటేజ్ వాక్ ఖిల్లా పైభాగం వరకు కొనసాగి అనంతరం జాఫర్ బావి వరకు నిర్వహించామనీ, విజయవంతంగా హెరిటేజ్ వాక్ పూర్తయిందనీ, కార్యక్రమంలో అనేక మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సహకారం అందించారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఖమ్మం ఖిల్లా చారిత్రక ప్రాముఖ్యతతో పాటు జిల్లాలోని పర్యాటక అభివృద్ధి అవకాశాలపై విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించామని తెలిపారు. పర్యాటక రంగ అభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పర్యాటక ఉత్సవాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ నరేష్ నాయక్, టూరిజం శాఖ సిబ్బంది జె. చంద్రశేఖర్ ఆజాద్, హెరిటేజ్ విభాగం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## దేశ వ్యాప్త మెడికల్ షాపులు బంద్ విజయవంతం..




మెట్రో ఈవెనింగ్ నేలకొండపల్లి మే 20...నేలకొండపల్లి మండలం దేశ వ్యాప్తంగా చేపట్టిన మెడికల్ షాపులు బంద్ విజయవంతం అయ్యాయి. మెడికల్ షాపు అసోసియేషన్ ప్రతినిధులు పసుపులేటి ఉపేందర్ మాట్లాడారు....కార్పోరేట్ సంస్థల దోపిడి ధరల విధానం ను స్థిరపడిన ఔషధ పంపిణీ వ్యవస్థ పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫార్మసీ రక్షణ కోసం, ప్రజాఆరోగ్య పరిరక్షణ కోసం ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ఫార్మసీ అక్రమ కార్యకలపాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పెద్ద కంపెనీల అన్యాయ ధరల విధానం నిలిపివేయాలని కోరారు. చిన్న తరహా, మరియు పెద్ద తరహా కెమిస్ట మనగడుకు కాకుండా ప్రజారోగ్యం పై కూడ తీవ్ర ప్రమాదాల ను కలిగిస్తున్నాయని అన్నారు. పలు డిమాండ్ల 'సాధన కోసం మెడికల్ షాపు యాజమానులు దుకాణాల బంద్ ను చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ షాపులు ప్రతినిధులు పి.వెంకటేశ్వరరావు. సురేష్, జగదీష్, ఫరీద్బాబా, ఉదయ్, సాయిబాబా, వి.నారాయణరావు, రాంప్రసాద్, కైలాసపు గోపి తదితరులు పాల్గొన్నారు.

## ఆన్లైన్లో మందులు అమ్మకాలు రద్దు చేయాలి




మెట్రో న్యూస్,ఏన్కూర్ మే 20: ఆన్లైన్లో మందులు అమ్మకాలు రద్దు చేయాలని మెడికల్ అసోసియేషన్ మండల అధ్యక్షులు గుడ్ల వెంకటేశ్వరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం దేశవ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్ కార్యక్రమం విజయవంతమైందని ఆయన అన్నారు. ఏన్కూర్ మండలంలో మొత్తం 22 షాపులు ఉన్నాయని అందరూ స్వచ్ఛందంగా తమ షాపులను బంద్ చేసి బంద్ కార్యక్రమంలో అందరూ పాల్గొన్నారు అని ఆయన తెలిపారు. ఆన్లైన్ అమ్మకాల వల్ల ప్రజలకు లాభాలు కంటే నష్టాలు ఎక్కువగా ఉన్నాయని తక్షణమే దాన్ని అరికట్టాలని, ప్రజలకు నాణ్యమైన క్వాలిటీ మందులను అందించే దానికోసం కేంద్ర ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని ఆయన అన్నారు. నకిలీ మందులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అధిక ఎమ్మార్పీలను కట్టడి చేయాలని, ప్రజా ఆరోగ్యాన్ని కాపాడ్డానికి న్యాయమైన వ్యాపార విధానాలను అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాలెపు పాపారావు, షేక్ హుస్సేన్ ఉద్దీన్, షేక్ పెంటు సాహెబ్, వంశీకృష్ణ, దొడ్డ శ్రీనివాసరావు, షేక్ జానీ తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌సైట్ ఎఫ్‌ఐఆర్‌తో ప్రజల వద్దకే పోలీసు సేవలు

### ఎస్పీ సునిత రెడ్డి



వనపర్తి, మెట్రో న్యూస్ ప్రజలకు మరింత చేరువయ్యే లక్ష్యంతో వనపర్తి జిల్లా పోలీసులు ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ సునిత రెడ్డి తెలిపారు. ఫిర్యాదు దారులు పోలీస్ స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేకుండా, సంఘటన జరిగిన ప్రదేశానికే వెళ్లి ఫిర్యాదులను స్వీకరించి ఎఫ్ఐఆర్ నమోదు చేసే ఈ విధానం ద్వారా బాధితులకు తక్షణ న్యాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలియజేశారు.
ప్రజలకు త్వరితగతిన, పారదర్శకంగా, నమ్మకమైన పోలీసు సేవలు అందించాలనే ఉద్దేశంతో వనపర్తి జిల్లా పోలీస్ శాఖ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ 'ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్' విధానాన్ని అమలు చేస్తోంది. బాధితులు పోలీస్ స్టేషన్‌కు రావడానికి ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితుల్లో, సంఘటన స్థలానికే వెళ్లి ఫిర్యాదు స్వీకరించి వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ద్వారా బాధితులకు తక్షణ న్యాయం అందించేందుకు ఈ విధానం ఎంతో ఉపయోగపడుతోంది. సమస్య ఎక్కడ జరిగిన ప్రజలకు పోలీసు సహాయం త్వరగా అందాలన్నదే మా లక్ష్యం. ఫిర్యాదు వచ్చిన వెంటనే పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని అవసరమైన చర్యలు తీసుకుంటారు.

**ఆన్‌సైట్ -ఎఫ్ఐఆర్‌తో మైనర్ బాలికకు తక్షణ న్యాయం**

ఈ విధానం ద్వారా ఇప్పటికే పలు కేసుల్లో బాధితులకు వేగవంతమైన న్యాయం అందుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఇటీవల వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక హాస్టల్‌లో చదువుకుంటున్న మైనర్ బాలికకు హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమై వేధింపులకు గురి చేస్తున్నాడు. అనంతరం వెంటనే కేసు నమోదు చేసి, సాంకేతిక ఆధారాలతో విచారణ చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. ఈ ఘటన ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్ విధానం ఎంత వేగంగా, బాధితులకు ఎంత భరోసానిచ్చే విధంగా పనిచేస్తుందో చూపించే ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచిందని పోలీసులు తెలిపారు. భయపడకుండా ముందుకు వచ్చి సమాచారం అందిస్తే పోలీసు శాఖ ప్రతి బాధితుడికి అండగా ఉంటుందని ఎస్పీ భరోసా ఇచ్చారు.

### ప్రాణా ఇంటిగ్రేటెడ్ హోమియోపతి

# ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే.



గద్వాల మే 20( మెట్రో న్యూస్ )గద్వాల పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో బుధవారం నిర్వహించిన ప్రాణా ఇంటిగ్రేటెడ్ హోమియోపతి ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమానికి ముందు ఎమ్మెల్యే దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రిబ్బన్ కటింగ్ చేసి ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ భరత్ కుమార్ ఎమ్మెల్యేకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. శిబిరంలో భాగంగా ఎమ్మెల్యేకు హోమియోపతి వైద్యులు ప్రత్యేకంగా చికిత్స అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్యవైశ్య కన్యకాపరమేశ్వరి దేవాలయం ప్రాంగణంలో ప్రజలకు ఉపయోగపడే ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అమ్మవారి సన్నిధిలో నిర్వహించే ప్రతి కార్యక్రమం విజయవంతమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రాణా ఇంటిగ్రేటెడ్ హోమియోపతి ద్వారా సహజసిద్ధంగా అనేక వ్యాధులకు ఉపశమనం లభిస్తోందని పేర్కొన్నారు. నాలుగు రోజుల పాటు కొనసాగనున్న ఈ ఉచిత వైద్య శిబిరాన్ని గద్వాల ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి పేద ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతు, వైస్ చైర్మన్ శంకర్, కౌన్సిలర్లు చంద్రశేఖర్, నాగులు యాదవ్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, మాజీ కౌన్సిలర్లు, దేవాలయ కమిటీ ప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భూత్పూర్ మున్సిపాలిటీలో కోఆప్షన్ సభ్యులకు ఎమ్మెల్యే జీఎంఆర్ శుభాకాంక్షలు.

### అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు.



మెట్రో న్యూస్ । దేవరకద్ర:దేవరకద్ర నియోజకవర్గంలోని భూత్పూర్ మున్సిపాలిటీ కేంద్రంలో నిర్వహించిన కోఆప్షన్ సభ్యుల ఎన్నిక కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే. మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కోఆప్షన్ సభ్యులు కోరే పవన్ కుమార్, ఆగిరి లావణ్య, ఎం.డి. అఫ్రోజ్ పాషా, ఎం.డి. తన్వీరా సుల్తానాలకు ఎమ్మెల్యే,శుభాకాంక్షలుతెలిపారు. అనంతరం,మున్సిపాలిటీలో డ్రైనేజ్, తాగునీటి సరఫరా, సీసీ రోడ్లు తదితర సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 కోట్ల నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేలా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఆదేశించారు.

## హకీంపేట క్రీడా పాఠశాలకు నాగర్‌కర్నూల్ విద్యార్థిని ఎంపిక.



నాగర్ కర్నూల్ రూరల్ :----(మెట్రో న్యూస్:మే 20)నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన లక్ష్య అథ్లెటిక్స్ కోచింగ్ సెంటర్ విద్యార్థిని గజ్జే నేహా రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చి హకీంపేట క్రీడా పాఠశాలకు ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణంగా మారిందని డి ఈ ఓ ఏ రమేష్ కుమార్ బుధవారం ప్రకటనలను తెలిపారు. తెలంగాణ క్రీడా పాఠశాలల్లో 4వ తరగతి ప్రవేశాల కోసం ఏప్రిల్ 30,మే 1 తేదీల్లో హకీంపేటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎంపికల్లో నేహా అద్భుత ప్రతిభ కనబరిచి ఎంపికైంది. చిన్న వయసులోనే క్రీడల్లో తన ప్రతిభను చాటుకున్న నేహాపై అభినందనల వెల్లువ కొనసాగుతోంది. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ విద్యార్థిని గజ్జే నేహాను అభినందిస్తూ,ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే లక్ష్య అథ్లెటిక్స్ కోచింగ్ సెంటర్ కోచ్ రాణా మల్లేష్ సేవలను అధికారులు ప్రశంసించారు గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికి తీయడంలో లక్ష్య కోచింగ్ సెంటర్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. మట్టిలోని మాణిక్యాలను వెలికి తీయడమే మా లక్ష్యం"అని కోచ్ రాణా మల్లేష్ తెలిపారు. ప్రతి ఏడాది రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాలల్లో లక్ష్య విద్యార్థులు ప్రతిభ చాటుతుండటం విశేషం. గజ్జే నేహా ఎంపికతో నాగర్‌కర్నూల్ జిల్లాకు మరోసారి క్రీడా రంగంలో గుర్తింపు లభించిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. క్రీడలను ప్రోత్సహిస్తే గ్రామీణ ప్రాంతాల నుంచి మరెంతో మంది ప్రతిభావంతులు వెలుగులోకి వస్తారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# బీసీ పొలిటికల్ జెఏసి జిల్లా మహిళ అధ్యక్షురాలిగా శ్రీవిద్య

### బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అరవింద్ చారి



నాగర్ కర్నూల్ (మెట్రో న్యూస్:మే20) నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో సావిత్రిబాయి పూలే భవనం లో బుధవారం నాడు బీసీ పొలిటికల్ జెఏసి జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ హాజరై జిల్లా మహిళా విభాగం బీసీ పొలిటికల్ జెఎస్టి అధ్యక్షురాలిగా నూతనంగా ఎన్నికైన శ్రీవిద్యకు కండువా కప్పి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ మాట్లాడుతూ, శ్రీవిద్య గౌడ్ ఉన్నత విద్యావంతురాలని, సేవాభావం కలిగి, సమాజం పట్ల అవగాహన ఉన్న వ్యక్తి అని, పలు కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారన్నారు. మహిళలను చైతన్యం చేసి, రాజ్యాధికారమే లక్ష్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. శ్రీవిద్య గౌడ్ మాట్లాడుతూ, నన్ను నమ్మి ఇంత పెద్ద బాధ్యత ఇచ్చినందుకు స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ కి, జిల్లా అధ్యక్షులు అరవిందా చారి కి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని, ఎంతో బాధ్యతగా మహిళల రిజర్వేషన్ పట్ల, మహిళల సాధికారత, సమానత్వం వంటి అంశాలపై పోరాటాలు చేసి బీసీలందర్నీ చైతన్యపరిచి ఏకతాటిపైకి తీసుకువచ్చి నాగర్ కర్నూల్ తాలూకా ఎమ్మెల్యేగా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ మహిళను గెలిపించుకునే విధంగా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమం అనంతరం శ్రీవిద్య ని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో ధర్మేంద్ర సాగర్, యశ్వంత్ గౌడ్, రాజు, ప్రవీణ్, నాగ శేషు, శ్రీధర్, సురేష్, రమేష్, గోపాలకృష్ణ, బీవమ్మ, సంధ్య, శిరీష, గాయత్రి, అనూష, స్వాతి,పుష్ప తదితరులు పాల్గొన్నారు.


## పటాన్‌చెరు తౌంబ్స్ వద్ద హెరిటేజ్ వాక్ నిర్వహణ



మెట్రో న్యూస్ పటాన్చెరు:ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యక్రమాల్లో టూరిజం వారోత్సవం సందర్భంగా బుధవారం పటాన్‌చెరు తౌంబ్స్ వద్ద హెరిటేజ్ వాక్ కార్యక్రమాన్ని జిల్లా టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా టూరిజం శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి మాట్లాడుతూ... జిల్లాలో ఉన్న చారిత్రక, సాంస్కృతిక వారసత్వ కట్టడాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పటాన్‌చెరు తౌంబ్స్ ప్రాంత చరిత్రకు ప్రతీకలుగా నిలుస్తున్నాయని, యువతలో వారసత్వ సంపదపై అవగాహన పెంపొందించేందుకు హెరిటేజ్ వాక్‌లు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. టూరిజం వీక్‌లో భాగంగా జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు చారిత్రక ప్రదేశాల ప్రాముఖ్యతను తెలియజేసే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు, యువత చరిత్రను తెలుసుకొని వారసత్వ సంపద పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువత, మున్సిపల్ అధికారులు, టూరిజం శాఖ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## 27 నుండి పాలీసెట్ కౌన్సిలింగ్

### -సంగారెడ్డి కళాశాల ప్రిన్సిపల్ పి. జానకి దేవి



మెట్రో న్యూస్ సంగారెడ్డి బ్యూరో:పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశం కోసం నిర్వహించిన పాలిసెట్- 2026 వెబ్ కౌన్సిలింగ్ ప్రక్రియ ఈనెల 27 నుంచి ప్రారంభమవుతుందని సంగారెడ్డి కళాశాల ప్రిన్సిపల్ పి. జానకి దేవి తెలిపారు. పాలీసెట్ లో అర్హత సాధించిన విద్యార్థులు ఈనెల 27వ తేదీ నుంచి 31 వరకు. ఆన్లైన్ ద్వారా ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాలని తెలిపారు. ఈనెల 29 నుంచి జూన్ 3 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ వెబ్ ఆప్షన్లు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. జూన్ 6న సీట్లు కేటాయింపు ఉంటుందని విద్యార్థులు ముఖ్యమైన తేదీలను అనుసరించి కౌన్సిలింగ్ ద్వారానే కళాశాలలో ప్రవేశం పొందాలని సూచించారు. పాలిటెక్నిక్ లో చేరిన విద్యార్థినీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

# మెడికల్ షాపుల బంద్ సక్సెస్



మెట్రో న్యూస్ సంగారెడ్డి బ్యూరో:ఆన్లైన్ మెడిసిన్ వ్యాపారానికి నిరసనగా రాష్ట్ర, జాతీయ కమిటీల పిలుపు మేరకు సంగారెడ్డి జిల్లా కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారుజాము నుంచే మెడికల్ షాపులను బంద్ చేశారు. షాపుల యజమానులంతా ఒక తాటిపైకి వచ్చి తమ నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కొద్ది సంవత్సరాలుగా తమ డిమాండ్ల సాధనకు సంఘం ద్వారా పోరాటం చేస్తున్నామని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. ముఖ్యంగా కార్పొరేట్ సంస్థల డిస్కౌంట్ ను ప్రభుత్వం అడ్డుకోవాలని, ఆన్లైన్ లో మందుల సరఫరాను ప్రభుత్వం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దీని ద్వారా అనేక అవాంఛనీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని సంఘ నాయకులు పేర్కొన్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితులలో సమాజాన్ని కాపాడేందుకు, ప్రతి పౌరుని ప్రాణాన్ని నిలబెట్టేందుకు మెడికల్ షాపుల ద్వారా తమ సేవలు అందించామని వారు అన్నారు. ప్రాణాలకు తెగించి పగలనకా, రేత్రనక అందుబాటులో ఉన్నామని గుర్తు చేశారు. అవసరమైన మందులను అందించి దేశ రక్షణలో భాగస్వాములు అయ్యామని చెప్పారు. కరోనా సమయంలో అనేకమంది మెడికల్ షాపుల యజమానులు, వారి కుటుంబ సభ్యులు తమ ప్రాణాలను కూడా లెక్కచేయకుండా సేవ చేశారని పేర్కొన్నారు. దశాబ్దాలుగా మందుల షాపులు సమాజానికి తోడుగా ఉన్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా నాయకులు వెల్లడించారు. ప్రభుత్వం తమ డిమాండ్ ను సత్వరమే ఆమోదించాలని వారు కోరారు. బందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈర్ణకృష్ణ, రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ, జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల సంతోష్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు దశరథ్, కృష్ణ, జ్ఞానేశ్వర్, పట్టణ కార్యదర్శి శశికాంత్, పట్టణ కోశాధికారి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### ఎండలు, వర్షాల నుంచి

# రక్షణ కల్పించేందుకు ట్రాఫిక్ సిబ్బందికి కిట్ల అందజేత

**-విధి నిర్వహణలో అప్రమత్తతతో ప్రజల భద్రతకు కట్టుబడి ఉండాలని సూచనాలు**

**-జిల్లా ప్రజల సురక్షిత ప్రయాణమే సంగారెడ్డి జిల్లా ట్రాఫిక్ పోలీసుల ప్రధాన బాధ్యత**

**-జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**




మెట్రో న్యూస్ సంగారెడ్డి బ్యూరో:సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీస్ సిబ్బందిని దృష్టిలో ఉంచుకొని ఎండలు, వర్షాల నుంచి రక్షణ కల్పించేందుకు, విధి నిర్వహణలో ఉపయోగపడే మొత్తం 9 వస్తువులతో కూడిన ప్రత్యేక కిట్లను బుధవారం జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ప్రజల రాకపోకలు సజావుగా సాగేందుకు ఎండలు, వర్షాలను లెక్కచేయకుండా విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది ఆరోగ్యం, భద్రత మా బాధ్యత అని, ట్రాఫిక్ సిబ్బందికి అవసరమైన రక్షణ సామగ్రిని అందించేందుకు ఈ కిట్లను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తున్నారని, ప్రజల సురక్షిత ప్రయాణం కోసం సంగారెడ్డి ట్రాఫిక్ పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది ఆరోగ్యాన్ని పరిరక్షిస్తూ, మరింత సమర్థవంతంగా సేవలు అందించేందుకు ఇటువంటి చర్యలు ఉపయోగపడతాయని జిల్లా ఎస్పీ తెలిపారు. ట్రాఫిక్ సిబ్బందికి అందజేసిన కిట్లలో క్యాప్, కూలింగ్ గ్లాసెస్, రిఫ్లెక్టివ్ జాకెట్లు 2, రెయిన్ కోట్లు, వాటర్ బాటిల్, లైటింగ్ బ్యాటన్, షోల్డర్ లైట్‌తో కూడిన బ్యాగ్ తదితర సామగ్రి ఉన్నాయి. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ రెడ్డి, ఇన్స్పెక్టర్స్ రమేష్, కిరణ్ కుమార్, ప్రవీణ్ రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన జిల్లా స్థాయి కార్యక్రమ ఏర్పాట్లపై సమీక్ష



నిజామాబాద్, మే 20 ( మెట్రోన్యూస్ )ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ఉ ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 22న నిర్వహించనున్న జిల్లా స్థాయి కార్యక్రమం ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ బుధవారం తన చాంబర్ లో సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రజాపాలన కార్యక్రమాలను చక్కగా నిర్వహించడం జరిగిందని, అదే స్ఫూర్తితో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని మరింత అట్టహాసంగా నిర్వహించేలా కృషి చేయాలన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ఫోటోలు, ఆయా పథకాల ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల జాబితాలను, సంక్షేమ పథకాలకు ప్రభుత్వం కేటాయించిన నిధుల వివరాలతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అందించేందుకు వీలుగా సమగ్ర వివరాలతో నివేదికలను అందించాలని ఆదేశించారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, సాధించిన పురోగతిని సమగ్రంగా ప్రదర్శించేలా నివేదికలు ఉండాలన్నారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు సంబంధించి స్టాళ్ళను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని, శాఖల వారీగా అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.గీత, జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్, సీ.పీ.ఓ రతన్, డీ.పీ.ఆర్.ఓ ఎన్.పద్మశ్రీ, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తుది దశకు చేరిన ధాన్యం సేకరణ ప్రక్రియ

**-మరో వారం రోజుల్లో పూర్తి కానున్న కొనుగోళ్లు**

**-వేసవి తీవ్రత దృష్ట్యా కొనుగోలు కేంద్రాల వద్ద ప్రత్యేక సౌకర్యాలు**

**-కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి**





నిజామాబాద్, మే 20 ( మెట్రోన్యూస్ )జిల్లాలో యాసంగిఉ2026 సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ తుది దశకు చేరిందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. మరో వారం రోజుల్లోపు ధాన్యం సేకరణను పూర్తి చేసేలా చర్యలు చేపట్టామని ఆమె వెల్లడించారు. ప్రభుత్వం తరఫున ధాన్యం సేకరణ కోసం ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా ఆధ్వర్యంలో ఈసారి జిల్లాలో మొత్తం 739 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 6.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తయ్యిందని, సుమారు రూ.1,500 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించగా, రైతుల ఖాతాల్లో రూ.1,320 కోట్ల బిల్లులు జమ అయినట్లు వివరించారు. ధాన్యం సేకరణ పూర్తయిన ప్రాంతాల్లో ఇప్పటికే 430 కొనుగోలు కేంద్రాలను మూసివేసినట్లు తెలిపారు. ఇంకా మిగిలిన కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 40 వేల నుంచి 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని, మరో వారం రోజుల్లో నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా కొనుగోళ్లు పూర్తి అవుతాయని పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో వరి కోతలు ఆలస్యంగా జరుగుతున్న కారణంగా ఇప్పుడిప్పుడే దిగుబడులు వస్తుండటంతో, అలాంటి ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. కాగా, వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాలు, రైస్‌మిల్లుల అన్‌లోడింగ్ పాయింట్ల వద్ద రైతులు, హమాలీల కోసం ఫస్ట్ ఎయిడ్ కిట్లు, తాగునీటి సదుపాయం, ఓఆర్ఎస్ సాచెట్లు, మజ్జిగ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కొన్ని రైస్‌మిల్లుల వద్ద మధ్యాహ్న సమయంలో ఉచిత భోజన సదుపాయం కూడా కల్పిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ధాన్యం సేకరణ చివరి దశలో రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టిందని కలెక్టర్ తెలిపారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలిస్తూ, రైతులకు సకాలంలో బిల్లుల చెల్లింపులు జరిగేలా ట్యాబ్ ఎంట్రీలను వేగవంతంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్రాల వద్ద సరిపడా సంఖ్యలో హమాలీలు అందుబాటులో ఉండటంతో పాటు, ధాన్యం రవాణా కోసం తగినన్ని లారీలను సమకూర్చినట్లు, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ కొనసాగుతోందని కలెక్టర్ స్పష్టం చేశారు.

## ఆర్ట్ ఆఫ్ లివింగ్ వేడుకల్లో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే



నిజామాబాద్, మే 20( మెట్రోన్యూస్ )ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండర్ రవిశంకర్ నేతృత్వంలో బెంగుళూరులో కొనసాగుతున్న 45వ వార్షికోత్సవ వేడుకల్లో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. ధ్యానం, యోగ, సత్సంగ్, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వార్షికోత్సవ వేడుకలతో పాటు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండర్ రవిశంకర్ 70 వ జన్మదినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా 180 దేశాల్లో 10వేలకు పైగా కేంద్రాలను నడిపిస్తూ ఆరోగ్యంతో పాటు ఆధ్యాత్మిక వైపు నడిపిస్తున్న సంస్థ అని కొనియాడారు. ఆధ్యాత్మికవేత్త రవిశంకర్ అనేక ఆశ్రమాలను నెలకొల్పడమే కాకుండా భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ వేడుకల్లో పాల్గొని ధ్యాన మందిరాన్ని ప్రారంభించారని చెప్పారు. ఈ ధ్యాన మందిరంలో అడుగుపెట్టడం అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

### నూతన వస్త్రాలంకరణ శుభకార్యం లో పాల్గొన్న ఈరవత్రి రాజశేఖర్



ఆర్మూర్, మే 20 ( మెట్రో న్యూస్ )ఆర్మూర్ పట్టణానికి చెందిన డాక్టర్ రాజు కూతురి నూతన వస్త్రాలంకరణ బుధవారం మామిడిపల్లి విజయలక్ష్మి గార్డెన్ లో జరిగిన కార్యక్రమానికి ఈ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ పాల్గొని చిన్నారిని దీవించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ సర్వ సమాజ్ సభ్యులు ఐడియా సాగర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చక్రు, రాజేశ్వర్, రాజేష్, రాజు, ఫౌండేషన్ సభ్యులు కుండ రాంప్రసాద్, విటోబా శేఖర్, తిరుమలేష్, క్రాంతి, తమ్మె వినోద్, ముఖేష్ పాల్గొన్నారు.

# మెడికల్ షాపుల బంద్ విజయవంతం.

**-ఆన్లైన్లో మందుల అమ్మకాలను ఆపాలంటూ డిమాండ్**







నిజామాబాద్, మే 20 ( మెట్రోన్యూస్ )జిల్లా వ్యాప్తంగా మందుల దుకాణాల బంద్ విజయవంతం అయినట్లు జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్. మధుసూదన్ తెలిపారు.
మందులను ఆన్ లైన్ అమ్మకాలను నిలిపివేయాలని కోరుతూ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఒక్కరోజు దేశవ్యాప్త మందుల దుకాణాల బంద్ కు ఇచ్చిన పిలుపుమేరకు జిల్లావ్యాప్తంగా విజయవంతమైంది. జిల్లా కేంద్రంలోని కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎన్. మధుసూదన్ మాట్లాడుతూ, కరోనా సమయంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకూడదని కేంద్ర ప్రభుత్వం ఆన్లైన్లో మందుల
అమ్మకాలని ప్రవేశపెట్టిందన్నారు. కరోనా ముగిసినప్పటికీ ఇప్పటికీ ఆన్లైన్లో మందుల అమ్మకాలు కొనసాగుతున్నవని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా 20 నుంచి 50 శాతం వరకు రాయతీలు ఇస్తూ ప్రజలను మభ్యపెడుతు నాసిరకం మందులను సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇకనైనా దిగివచ్చి కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ ఆధ్వర్యంలో నడిచే దుకాణాలలో మందుల అమ్మకాలను ప్రోత్సహించాలని కోరారు. ఈమధ్య ఎఐ టెక్నాలజీతో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ తయారుచేసి మందులను తెప్పించుకోవడం చాలా ప్రమాదకరమన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.సుధాకర్, కోశాధికారి ఎం.సాయిలు, ఉపాధ్యక్షులు సురేందర్, రవీందర్రావు, పట్టణ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి సంతోష్, కోశాధికారి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లు లను పరిశీలించిన కలెక్టర్





కామారెడ్డి మే 20 (మెట్రో న్యూస్)కామారెడ్డి జిల్లాలోని రైస్ మిల్లు బుధవారం జంగంపల్లి గ్రామంలోని శాకంబరి రైస్ మిల్లును జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వా న్ సందర్శించి, ధాన్యం కొనుగోలు ,అన్‌లోడింగ్ కార్యకలాపాలను సమీక్షించారు.
పరిశీలన సందర్భంగా పీపీసీల వద్ద పెండెన్సీ తగ్గించడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు.
ముఖ్యంగా ప్రస్తుత పీక్ ప్రొక్యూర్‌మెంట్ సీజన్ , వర్షాల అవకాశాలను దృష్టిలో ఉంచుకొని, అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి వాహనాల క్లియరెన్స్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.
ఈ సందర్భంగా హెడ్ ఆఫీస్ నుండి సుమారు 85 శాతం బాయిల్డ్ రైస్ అలోకేషన్ ముందుగానే అందినందుకు మిల్లర్ సంతృప్తి వ్యక్తం చేశారు.
అన్‌లోడింగ్ సామర్థ్యాన్ని పెంచడం వాహనాల క్లియరెన్స్‌ను వేగవంతం చేయడంలో పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ విక్టర్, , జిల్లా సివిల్ సప్లైస్ అధికారి డి సి ఎస్, డీఎం సివిల్ సప్లైస్, తహసీల్దార్ డీటీసీఎస్ కలిసి

### తల సేమియా వ్యాధి చిన్నారుల కోసం

# మెగా రక్తదాన శిబిరం



కామారెడ్డి మే 20 (మెట్రో న్యూస్)కామారెడ్డి జిల్లా కేంద్రంలో తల సేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరానికి సంబంధించిన కరపత్రాలను ఆదిత్య హాస్పిటలో ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు,ఐవిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలువేరి మారుతి, ఆదిత్య హాస్పిటల్ వైద్యులు డాక్టర్ అజయ్ పేరాల లు విడుదల చేయడం జరిగింది. ఆదివారం నిర్వహించే ఈ రక్తదాన శిబిరంలో యువత పాల్గొని రక్తదానం చేసి చిన్నారుల ప్రాణాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు మాట్లాడుతూ ఆదిత్య హాస్పిటల్ వారి సహకారంతో తలసేమియా బాధిత చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని,దానికి సహకరిస్తున్న వైద్యశాల నిర్వాహకులు చిలువేరి మారుతి, డాక్టర్ అజయ్ పేరాల కు ఐవిఎఫ్, కామారెడ్డి రక్త దాతల సమూహం, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. రక్తదానంలో పాల్గొని రక్తదానం చేసే మొదటి వందమంది రక్తదాతలకు హెల్మెట్లను,ప్రశంస పత్రాలను,కీ చైన్ లను అందజేయడం జరుగుతుందని మరిన్ని వివరాలకు 9492874006,9885707042 కు సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐవిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దొంతి సుధాకర్, కోశాధికారి కస్వ వెంకటేష్,ఆధ్యాత్మిక విభాగం అధ్యక్షులు ఎల్లంకి సుదర్శన్, సలహాదారులు మందుల రామచంద్రం లు పాల్గొనడం జరిగింది.

## నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై చర్యలు తీసుకోవాలి

**-తెలంగాణ రైతు సంఘం డిమాండ్**




నవీపేట్, మే 20( మెట్రోన్యూస్ ) మండలంలో నకిలీ విత్తనాలు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దేవేందర్ సింగ్, మండల అధ్యక్షులు ఈడ గొట్టి చిన్న ఒడ్డెన్న లు మాట్లాడుతూ యాసంగి సాగుకు ఐదు ఎకరాలకు ఇవ్వవలసిన పూర్తి నిధులు ఇవ్వలేదన్నారు. ఒక సంవత్సరానికి 12 వేల రూపాయలు అరకోర నిధులను విడుదల చేస్తున్నారని దానివల్ల రైతులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. మండలంలో నకిలీ మందులు, నకిలీ విత్తనాలు నకిలీ పురుగు మందులు అమ్మిన వారిపై వెంటనే చట్టరిత్యా చర్యలు తీసుకోవాలన్నారు. లింకులు పెట్టి విత్తనాలు అమ్మిన వారిపై చర్యలు తీసుకోవాలని,యూరియా యాప్ ని రద్దుచేసి పాత విధానంలోనే రైతులకు విత్తనాలు అందించాలన్నారు. ఎరువుల కొరత లేకుండా రైతులకు సకాలంలో అందించాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేస్తున్నామన్నారు. యాసంగి పంటకు రైతులకు కింటలుకు 500 రూపాయలు బోనాస్ ఇవ్వాలన్నారు. అలాగే పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్లను సక్రమంగా బ్లాక్ చెయ్యకుండా అందించాలన్నారు. కాంప్లెక్స్ రేట్లు తగ్గించి,పురుగుమందుల రేట్లు తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం మండల ఉపాధ్యక్షులు గోవిందారం లింగం,మండల నాయకులు పల్లికొండ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆదేశానుసారం కీసరగుట్టలో హెరిటేజ్ వాక్





**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (మెట్రో న్యూస్ ):** పురాణాలకు చరిత్రగా, ఆధ్యాత్మికతకు నిలయంగా సాంస్కృతికతకు కేంద్రంగా పేరుగాంచిన ప్రాచీన శివక్షేత్రం కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి దేవాలయం అని జిల్లా కలెక్టర్ మను చౌదరి పేర్కొన్నారు.ప్రతి జిల్లాలో చారిత్రక, పర్యాటక ప్రాధాన్యత కలిగిన ప్రదేశాలలో హెరిటేజ్ వాక్ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగా, మన జిల్లాలోని ప్రముఖ పర్యాటక క్షేత్రమైన కీసరగుట్టను టూరిజం శాఖ ఎంపిక చేసింది. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9 గంటలకు కీసర గుట్ట నంది విగ్రహం వద్ద ప్రారంభమై ఆలయం పైభాగం వరకు నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా యువజన మరియు క్రీడల అధికారి & జిల్లా పర్యాటకం అధికారి (ఇంచార్జ్) ఐ. విజయ కుమారి, ఎల్డీఎం శివప్రసాద్, జిల్లా ఉపాధి కల్పన అధికారి రాధిక పాల్గొన్నారు. అదే విధంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన కోలాటం కళాకారులు, సైక్లింగ్ మరియు క్రీడలకు సంబంధించిన విద్యార్థులు, స్థానిక యువత, ఆలయ పురోహితులు, ఉపాధ్యాయులు, ఎంపీఓలు, స్పోర్ట్స్ బీపీటీలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మొత్తం సుమారు 150 మంది ఈ హెరిటేజ్ వాక్లో పాల్గొన్నారు.అనంతరం కీసర గుట్ట ఆలయ కమిటీ ఛైర్మన్ తటాకం వెంకటేష్ శర్మ కలెక్టర్ కు పూల మొక్క అందించి స్వాగతం పలికారు. తదుపరి శివాలయంలో పూజలు నిర్వహించి వేదమంత్రోచ్ఛరణతో కలెక్టర్‌కు,అదనపుకలెక్టరుకుపండితులు ఆశీర్వచనం తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బ్రహ్మో త్సవాలు ప్రతి సంవత్సరం ఎంతో ఘనంగా జరుగుతాయని దేశవ్యా ప్తంగా వివిధ ప్రాంతాల నుండి భక్తులు ఇక్కడికి తరలివచ్చి, స్వామివారి ఆశీస్సులు తీసుకుంటారన్నారు. భక్తులకు అవసరమైన వసతులను కల్పించాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగం మీద ఉందన్నారు. ప్రతి బ్రహ్మోత్సవానికి, గతంలో చేసిన దానికంటే కొత్తగా, ఏదో ఒక మెరుగుదల చూపించాలన్నారు. దేశ, విదేశాలలో కీసరగుట్టపై ఎంతో భక్తిభావం ఉన్న దాతలు చాలా మంది ఉన్నారని, ఇప్పటికే వారి విరాళాల ద్వారా ఆలయానికి సంబంధించి ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ప్రభుత్వం తరపున మరియు దాతల సహకారంతో నిధులను మరింత సేకరించి ఆలయాన్ని ఇంకా అభివృద్ధి చేయవచ్చన్నారు. పర్యాటక అభివృద్ధికి అవసరమైన అంశాలను టెంపుల్ ఈవో ప్రతిపాదిస్తే, వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు జిల్లా స్థాయిలో కూడా అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, కీసర గుట్ట ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతమని, నేను కొత్తగా వచ్చిన తర్వాత ఈ ప్రాంత విశిష్టతను ఎండోమెంట్ శాఖ ద్వారా తెలుసుకున్నానని, ఈ ప్రాంత అభివృద్ధికి మా వంతు సహకారం అందిస్తాము అని తెలిపారు.

## ఏసీబీకి చిక్కిన ఎస్ఐ



**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** బోయినపల్లి పోలీస్ స్టేషన్ లో ఏసీబీ అధికారులు బుధవారం సాయంత్రం దాడులు నిర్వహిం చారు. ఓ కేసులో ఎస్ ఐ నందిత 30వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.

## మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి ఘన నివాళి

**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** భారత రత్న, మాజీ ప్రధాని, ఆధునిక భారత నిర్మాణ శిల్పి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఘన నివాళులు అర్పించారు. రాజీవ్ గాంధీ దేశ రాజకీయాల్లో యువతకు కొత్త దిశానిర్దేశం చేసిన దూరదృష్టి కలిగిన నాయకుడని కొనియాడారు. దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లాలన్న మహత్తర సంకల్పంతో సమాచార సాంకేతిక రంగానికి పునాది వేసిన నాయకుడు రాజీవ్ గాంధీ అని పేర్కొన్నారు. టెలికాం విప్లవం, కంప్యూటరీకరణ, పం చాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, యువతకు ఓటు హక్కు వయ స్సును 18 సంవత్సరాలకు తగ్గించడం వంటి ఎన్నో సంస్కరణలు ఆయన నాయకత్వంలో అమలయ్యాయని గుర్తుచేశారు. గ్రామీణాభివృద్ధి, విద్య, మహిళా సాధికారత, శాస్త్ర సాంకేతిక రంగాల పురో గతికి రాజీవ్ గాంధీ చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. దేశ సమగ్రత, లౌకికవాద పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం ఆ యన జీవితాంతం కృషి చేశారని తెలిపారు.రాజీవ్ గాంధీ ఆశయా లను కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుకు తీసుకెళ్తుందని, దేశ అభివృద్ధి కోసం ఆయన చూపిన మార్గం నేటికీ స్ఫూర్తిదాయకమని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. యువత దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్న రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు.దేశానికి ఆ మహానీయుడు అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.

# ఆర్జీకేలో గంజాయి, మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు

### - యువత మత్తుకు దూరంగా ఉండాలని పిలుపు



**కుత్బుల్లాపూర్,మే 20,మెట్రో న్యూస్ ప్రతినిధి:** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జగద్గిరిగుట్ట డివిజన్ రాజీవ్ గృహకల్ప సముదాయంలో మంగళవారం తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గంజాయి, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. తెలంగాణ ప్రజా నాట్య మండలి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం ప్రజల్లో విశేష చైతన్యాన్ని కలిగించింది."ఎంజాయ్ చేద్దాం రండిగంజాయ్ వీడుదాం – భవితను కాపాడుదాం" అనే నినాదాలతో నిర్వహించిన ఈ బహిరంగ సభలో కళాకారులు ప్రత్యేక కళారూపాలు ప్రదర్శించి ప్రజలను ఆకట్టుకున్నారు. పాటలు, నృత్యాలు, నాటికల ద్వారా గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కుటుంబాలు, సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను కళ్ళకు కట్టినట్టు వివరించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లలపై దృష్టిసారించాలని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. మత్తు పదార్థాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండడంతో పాటు అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.కార్యక్రమంలో స్థానిక ప్రజలు,ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కళాకారుల ప్రదర్శనలను ఆసక్తిగా వీక్షించారు.

# యువతను మోసగించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ : ఎమ్మెల్యే



**మెట్రోన్యూస్, కూకట్‌పల్లి:** ఉద్యోగాలు ఇస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చాక ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ యువతను, విద్యార్థులను అన్నివిధాలా మోసగించారని కూకట్ పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం నాయకులతో ఏర్పాటైన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, యువత అన్ని రంగాల్లో రాణిస్తూ తల్లిదండ్రులకు, ఊరికి మంచి పేరు తీసుకుని రావాలన్నారు. యువతకు బీఆర్ఎస్ పార్టీ అధిక ప్రాధాన్యత ఇస్తుందని, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి కేసీఆర్, కేటీఆర్ ఎప్పుడు అండగా ఉంటారన్నారు.

రాహుల్ గాంధీ తెలంగాణకు వచ్చినప్పుడు వేల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇవ్వకుండా యువతను, విద్యార్థులను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్ పి.బాబూరావు, గౌసుద్దీన్, అంబటి శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు జన్నుసాయిశ్రీనివాస్, బొట్టు విష్ణు, చైతన్య యాదవ్, అశ్వంత్, అభిలాష్ రావు,పవన్,రావెల్, మోజెస్, త్రినాథ్ సోషల్ మీడియా వారియర్స్ పుచ్చకాయల కిరణ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు చేయాలి :బీజేపీ



**రామాయంపేట( మెట్రో న్యూస్):** ధాన్యం కొనుగోలు చేయాలనే ప్రధాన డిమాండ్ తో మండల బీజేపీ నాయకులు ఎంఆర్ఓ కు వినతి పత్రం ఇచ్చారు భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు నవీన్ గౌడ్ అధ్యక్షతన ఎమ్మార్వోకు బీజేపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగాబీజేపీ నాయకులు మాట్లాడుతూ, నెల రోజులుగా రైతులు కల్లాల్లో నిల్వ ఉంచిన వరి ధాన్యం ఇప్పటికీ సగం కూడా కొనుగోలు కాకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రామాయంపేట మండలంలోని అన్ని గ్రామాల్లో ఎటు చూసినా ధాన్యం కుప్పలు కనిపిస్తున్నాయని, రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి ఎదురుచూస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు.నిన్న కురిసిన అకాల వర్షాల కారణంగా లక్ష్మీపూర్, పర్వతాపూర్, కాట్రాల్, దంతపల్లి, కిషన్ తండా తదితర గ్రామాల్లో రైతుల ధాన్యం పూర్తిగా తడిసిపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అయినప్పటికీ అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ గ్రామాలకు వెళ్లి రైతులను పరామర్శించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు.గత 25 రోజులుగా ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రహదారుల వెంట ఎటు చూసినా ధాన్యం కుప్పలే కనిపిస్తున్నాయని అన్నారు. రైతులు రాత్రింబవళ్లు ధాన్యం కుప్పల పక్కనే కాపలా కాస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మెదక్ నుంచి నిజాంపేట్ వరకు పర్యటించినప్పటికీ ఒక్కరోజైనా రైతుల వద్ద ఆగి వారి సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేయలేదని విమర్శించారు. దొంగల ధర్మారం, కోమటిపల్లి తదితర గ్రామాల్లో రైతులు రోడ్డెక్కి నిర సనలు తెలిపినా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన నిధులు, బస్తాల కమిషన్లతో సహా అన్నీ అందిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కొనుగోళ్లు చేపట్టకపోవడం రైతాంగంపై నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే వెంటనే జోక్యం చేసుకుని మండలంలోని రైతుల ధాన్యంమొత్తంత్వరితగతిన కొనుగోలు అయ్యేలా చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. అలాగే వచ్చే పది రోజుల్లో మండలంలోని మొత్తం ధాన్యం కొనుగోలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులురాగి రాములు, కిసాన్ మోర్చా అధ్యక్షులు సంగయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు వెలుమల సిద్ధరాములు, మండల ఉపాధ్యక్షులు శ్యామలచారి, జిల్లా కార్యవర్గ సభ్యులు పోలీస్ దేవేందర్, ధర్మారం లక్ష్మణ్, బాలరాజు, సిద్ధరాములు, భాను ప్రకాష్, సాయి చరణ్, రాజేష్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## హీరో మంచు మనోజ్‌కు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ అధ్యక్షులు తమ్మినేని



**మెట్రో న్యూస్, కూకట్‌పల్లి :** తెలుగు సినీ కథానాయకులు మంచు మనోజ్‌ను కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్ నగరంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తమ్మినేని ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, యువ కథానాయకుడు మంచు మనోజ్ విలక్షణమైన నటనతో తెలుగు ప్రేక్షకులను అలరారిస్తూనే మరోవైపు సామాజిక కార్యక్రమాల ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలకు విశేషంగా సేవలందిస్తున్నారని కితాబిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరంలో మందులు పంపిణీ చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు




**మెట్రో న్యూస్, కూకట్‌పల్లి :** సరళాదేవి ఫౌండేషన్, గౌతమ్ న్యూరో హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ గౌతమ్ ఆధ్వర్యంలో బుధవారం కేపీహెచ్‌బీ కాలనీలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో ప్రజలకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు జస్వంత్ రావుతో కలిసి కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉచిత వైద్య శిబిరానికి విశేష ఆదరణ లభించిందని, మానవతా దృక్పథంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగిరెడ్డి, తూము వేణు, మేకల మైకెల్, ఫణికుమార్, పొడుగు అప్పారావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆవులను అక్రమంగా రవాణా చేసే వారిని శిక్షించాలి : కుమార్ యాదవ్



**మెట్రో న్యూస్, కూకట్‌పల్లి :** గోవులను అక్రమంగా తరలిస్తున్న వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గో రక్షణ సమితి ఆధ్వ ర్యంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా బీజేపీ యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ ను బుధవారం తెల్లవారుజామున పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ, ఆవులను అక్రమంగా రవాణా చేస్తున్న వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. మే 16 శనివారం రాత్రి గోవుల తో వెళ్తున్న లారీని గో రక్షక్ దళ్ కార్యకర్తలు అడ్డుకోగా ఎంఐఎం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ ఆ లారీని తీసుకెళ్లడం ఎంతవరకు కరెక్ట్ అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. .గోవులను అక్రమ రవాణా చేస్తూ బహిరంగంగా తిరుగుతున్న వారిపై వెంటనే కేసులు పెట్టాల న్నారు. గోమాతను కాపాడాలని చెప్పే ప్రభుత్వంఅక్రమ రవాణాను ఎందుకు ఆపడం లేదని నిలదీశారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. హిందువుల మనోభావాలను కాపాడాల్సిన బాధ్యత గల రాష్ట్ర ప్రభుత్వం ఒకే వర్గానికి కొమ్ము కాస్తూ వారి ఆగడాలను సమర్థించడం సరైనది కాదన్నారు.

## ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి రూ.50 వేల ఆర్థిక సహాయం అందించిన శ్రీశైలం గౌడ్

### విద్యార్థుల భవిష్యత్తు... పాఠశాల అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటా

**మెట్రోన్యూస్,ఇబ్రహీంపట్నం:** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని శేరిగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కొరకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తాళ్ల శ్రీశైలం గౌడ్ రూ.50 వేలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ కి గురువారం అందజేశారు.ఈ సందర్భంగా తాళ్ల శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సాధించిందని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన అన్నారు.పాఠశాల అభివృద్ధి విద్యార్థుల భవిష్యత్తు కోసం తాను ఎల్లపుడు అండగా ఉండి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.పాఠశాల అభివృద్ధి కోసం ముందుకు వచ్చి 50 వేల రూపాయలు అందించిన తాళ్ల శ్రీశైలం గౌడ్ కి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రతేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## గంగమాంబకు ప్రత్యేక పూజలు



కుప్పం: చిత్తూరు జిల్లా కుప్పం శ్రీప్రసన్న తిరుపతి గంగమాంబ జాతరలో ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. కుప్పం పర్యటనలో భాగంగా ఉండవల్లి నుంచి హెలికాప్టర్ ద్వారా తుమ్మిసి హెలిప్యాడ్కు వచ్చిన సీఎం.. కడపల్లెలోని ఆయన స్వగృహానికి చేరుకున్నారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో శ్రీప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయానికి చేరుకున్న సీఎంకు.. అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. జాతర సందర్భంగా అమ్మవారికి కుటుంబ సమేతంగా పట్టువస్త్రలను సమర్పించి.. ప్రత్యేకపూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.



# నెల్లూరు జిల్లాలో పర్యటన

నెల్లూరు జిల్లాలో పర్యటించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక మత్స్యకార కుటుంబంలో సందడి చేసి తన ఆత్మీయతను చాటుకున్నారు. కావలి మండలం తుమ్మలపెంటలో నిర్వహించిన 'మత్స్యకారుల సేవలో' కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం, సీఎం చంద్రబాబు స్థానిక చేపల మార్కెట్ను సందర్శించి మత్స్యకారులతో ముచ్చటించారు. మార్కెట్లో స్వయంగా చేపలు కొనుగోలు చేసిన ఆయన, స్థానిక మత్స్యకారుడు తానంగారి బాబు ఆహ్వానం మేరకు వారి ఇంటికి వెళ్లారు. నేలపై కూర్చుని.. చేపల పులుసుతో భోజనం సీఎం చంద్రబాబు కొనుగోలు చేసిన చేపలతో తానంగారి బాబు సతీమణి వెంకమ్మ సాంప్రదాయ పద్ధతిలో చేపల పులుసు వండారు. సీఎం స్వయంగా వంటగదిలోకి వెళ్లి వంట విధానాన్ని పరిశీలించడమే కాకుండా సరదాగా గరిటె తిప్పారు. అనంతరం మత్స్యకార కుటుంబ సభ్యులతో కలిసి చంద్రబాబు నేలపై కూర్చుని భోజనం చేశారు. భోజన సమయంలో కుటుంబ సభ్యులకు స్వయంగా ఆయనే వడ్డించడం అక్కడి వారిని ఆకట్టుకుంది. ఇటీవల ప్రసవించిన బాబు కుమార్తెను పలకరించి తల్లీబిడ్డల క్షేమసమాచారాలు అడిగి తెలుసుకున్నారు. పథకంపై మత్స్యకారుల ఆనందం ఈ సందర్భంగా 'మత్స్యకారుల సేవలో' పథకం ద్వారా ఏడాదికి అందుతున్న రూ. 20,000 ఆర్థిక సాయం తమ కుటుంబాలకు ఎంతగానో ఉపయోగపడుతోందని తానంగారి బాబు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తమ ఇంటికి వచ్చి భోజనం చేయడం జీవితంలో మరిచిపోలేని అనుభూతి అని ఆ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. చివరగా కుటుంబ సభ్యులందరితో కలిసి సీఎం చంద్రబాబు గ్రూప్ ఫొటో దిగారు.


# పెట్రోల్ డీజిల్ ధరల పెంపు




ఆంధ్రప్రదేశ్లో వరుసగా పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్య వాహనదారులు, రవాణా రంగంపై కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయి. తాజాగా లీటర్ ఇంధనంపై మరో 90 పైసలు అదనంగా భారం పడటంతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 4,500 పెట్రోల్ బంకుల ద్వారా రోజుకు సగటున 10,000 కిలో లీటర్ల పెట్రోల్, అలాగే 15,000 కిలో లీటర్ల డీజిల్ విక్రయాలు జరుగుతుంటాయి. ఈ తాజా పెంపుదల లెక్కల ప్రకారం.. కేవలం పెట్రోల్ వాడే వాహనదారులపై రోజుకు రూ.90 లక్షలు, డీజిల్ వినియోగించే లారీ, బస్సు, భారీ వాహనాల యజమానులపై రోజుకు ఏకంగా రూ.1.35 కోట్ల చొప్పున అదనపు ఆర్థిక భారం పడుతోంది. వెరసి రాష్ట్ర ప్రజలపై రోజువారీగా మొత్తం రూ.2.25 కోట్ల మేర భారం పడుతుండటంతో మధ్యతరగతి జేబులకు చిల్లులు పడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ వార్తలు ప్రస్తుతం విజయవాడలో లీటర్ పెట్రోల్ ధర రూ.113.45 కు చేరగా, డీజిల్ ధర రూ.101.17 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల హెచ్చుతగ్గులు మరియు దేశీయంగా పెరిగిన పన్నుల కారణంగా ఈ భారం మోయాల్సి వస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు. నిత్యావసర వస్తువులను ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి చేరవేసే డీజిల్ ధరలు రూ.100 దాటడంతో రవాణా ఛార్జీలు భారీగా పెరిగి, పరోక్షంగా కూరగాయలు, నిత్యావసరాల ధరలు కూడా పెరిగే ప్రమాదం కనిపిస్తోంది. ఒకవైపు జీతాలు పెరగక, మరోవైపు రోజురోజుకూ ఇంధన ధరలు దిగిరాకపోవడంతో సామాన్యుడు ప్రత్యామ్నాయ మార్గాల వైపు చూసే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి పన్నుల రాయితీ ద్వారా ధరలను అదుపు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## అతడి కోసం మోడీ బానిసయ్యారు





ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ ప్రయోజనాల కోసం పీఎం మోదీ దేశ ప్రతిష్టను అంతర్జాతీయ స్థాయిలో దిగజార్చారని ఆమె ఘాటుగా విమర్శించారు. ఈ మేరకు ఆమె ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఒక సంచలన పోస్ట్ను పంచుకున్నారు. దేశ చరిత్రను గుర్తుచేస్తూ.. ఆనాడు కాంగ్రెస్ ప్రధాని ఇందిరా గాంధీ అమెరికా లాంటి అగ్రరాజ్యాన్ని సైతం ధీటుగా ఎదుర్కొని దేశ సార్వభౌమత్వాన్ని కాపాడారని, కానీ నేడు మోదీ మాత్రం అదానీ రక్షణ కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్కు బానిసలా మారిపోయారని ధ్వజమెత్తారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశాన్ని మళ్లీ ప్రగతి పథంలో నిలబెట్టాలన్నా, అంతర్జాతీయంగా భారత గౌరవాన్ని కాపాడాలన్నా అది కేవలం రాహుల్ గాంధీ నాయకత్వంతోనే సాధ్యమవుతుందని ఆమె స్పష్టం చేశారు.

# దేశానికే ఆదర్శంగా ఆంధ్ర మోడల్ ఎడ్యుకేషన్ తీర్చిదిద్దుతాం




అమరావతి: దేశానికే ఆదర్శంగా ఆంధ్ర మోడల్ ఎడ్యుకేషన్ ఉండాలన్నది నా ధ్యేయం, అందుకు అనుగుణంగా విద్యావ్యవస్థను తీర్చిదిద్దేందుకు కృతనిశ్చయంతో ఉన్నా. అంతర్జాతీయస్థాయి అత్యుత్తమ బోధనా పద్ధతులపై అధ్యయనానికి ఉపాధ్యాయులను విదేశాలకు పంపుతున్నాం. అక్కడ వారు తెలుసుకున్న మంచి బోధనాపద్ధతులను రాష్ట్రంలో అమలు చేస్తామని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అమరావతి సచివాలయంలో రాష్ట్రవ్యాప్తంగా డీఈవోలు, ఏపీసీలతో(అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్స్) మంత్రి సుదీర్ఘ సమీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... క్వాలిటీ మెరుగుపర్చకపోతే నష్టపోయేది పిల్లలు. ప్రభుత్వ విద్యావ్యవస్థ ఓపెన్ మార్కెట్ తో పోటీపడాలి. ఇందుకోసం అందరం కలిసికట్టుగా పనిచేయాలి. క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకునేందుకు ఈ సమావేశం ఏర్పాటుచేశాం. వరల్డ్ క్లాస్ బెస్ట్ మోడల్ ఆఫ్ పబ్లిక్ స్కూల్ ఎడ్యుకేషన్ నా లక్ష్యం, ఇందుకోసం అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలని మంత్రి లోకేష్ దిశానిర్దేశం చేశారు.నినిబిడ్డల భవిష్యత్తు కేంద్రంగా నిర్ణయాలునినిఈ సమావేశం కేవలం సమీక్ష కోసం కాదు, యాక్షన్ ప్లాన్ కోసం ఏర్పాటుచేశాం. నేను విద్యామంత్రిగా బాధ్యతలు స్వీకరించే నాటికి రాష్ట్రంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి, ఏ పాఠశాలలో ఎంతమంది చదువుతున్నారో రాష్ట్రస్థాయి విజిబిలిటీ, కనీస డేటా అందుబాటులో లేదు. పంచాయితీరాజ్ మంత్రిగా పనిచేసినప్పుడే నేను కేవలం మూడునెలల్లో పూర్తిస్థాయి సమాచారంతో డ్యాష్ బోర్డు తయారుచేశాం. విద్యాశాఖలో కనీస డేటా బేస్ అందుబాటులో లేని పరిస్థితి నుంచి విద్యాశాఖలో నా ప్రయాణం ప్రారంభించాను. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు మన సొంత బిడ్డల్లా భావించి నిర్ణయాలు తీసుకోవాలి. మనం తీసుకునే నిర్ణయాలపై వారి భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. బిడ్డల భవిష్యత్ కేంద్రంగా నిర్ణయాలు ఉండాలి. డ్యాష్ బోర్డు ప్రకారం యాక్షన్ ప్లాన్ దిశగా డీఈవోలు, ఏపీసీలు పనిచేయాలి.

# నిప్పుల కొలిమి

## రేపు 50 డిగ్రీలు దాటనున్న ఉష్ణోగ్రతలు



రాష్ట్రంలో ఎండలు తీవ్రస్థాయికి చేరుకున్నాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఈ క్రమంలోనే తాజా ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. రాబోయే రోజుల్లో కొన్ని ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా పశ్చిమ గోదావరి, ఏలూరు, పోలవరం పరిసర ప్రాంతాల్లో ఎండ తీవ్రత ఊహించని విధంగా ఉండబోతోంది. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు జిల్లాల్లో కూడా ఉష్ణోగ్రతలు భారీగా పెరిగే అవకాశం ఉంది. వీటితో పాటు కోనసీమ, బాపట్ల, నంద్యాల ప్రాంతాల్లో మండుటెండలు జనజీవనాన్ని అతలాకుతలం చేయనున్నాయి. కోస్తా తీరప్రాంత జిల్లాల్లో ఎండలతో పాటు గాలిలో తేమ శాతం పెరగడం వల్ల ఉక్కపోత తీవ్రంగా ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల వల్ల పగటిపూట ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే ప్రమాదం ఉంది. తీవ్రమైన ఎండల నేపథ్యంలో ప్రజలు అత్యవసర పనులు ఉంటే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు స్పష్టం చేశారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 4 గంటల వరకు ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఆ సమయంలో ప్రయాణాలు నివారించడం మంచిది. శరీరం డీహైడ్రేషన్కు గురికాకుండా ఉండటానికి తగినన్ని నీళ్లు, మజ్జిగ, కొబ్బరిబొండాల వంటి ద్రవాహారం తీసుకోవాలని వైద్యులు సలహా ఇస్తున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు ఈ సమయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి.





## సింపతీ కోసం ఇంత దారుణమైన ప్లానా

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో సంచలనం సృష్టించిన పాస్టర్ అభినయ్ దర్శన్ దాడి ఉదంతం చివరకు ఒక పెద్ద హైడ్రామాగా తేలింది. తనపై గుర్తు తెలియని వ్యక్తులు బీరు సీసాలు, రాళ్లతో దాడి చేశారంటూ ఆయనే సృష్టించుకున్న ఈ కథ వెనుక అసలు నిజాలను పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. కేవలం ప్రజాదరణ, సానుభూతి (సింపతీ) కోసమే సొంతంగా ముందస్తు స్కెచ్ వేసి ఈ నాటకానికి తెరలేపినట్లు పోలీసులు ఆధారాలతో సహా నిరూపించారు.

# హార్టికల్చర్ హబ్ గా రాయలసీమ



రాయలసీమ ప్రాంత రూపురేఖలను మార్చేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఎప్పుడు కరవు కాటకాలతో అల్లాడే రాయలసీమను దేశంలోనే ప్రముఖ "హార్టికల్చర్ హబ్" (ఉద్యానవన పంటల కేంద్రం)గా తీర్చిదిద్దేందుకు ఒక సమీకృత ఉద్యాన అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం రాయలసీమ వ్యాప్తంగా 8.41 లక్షల హెక్టార్లలో రకరకాల ఉద్యాన పంటలు సాగవుతుండగా, రాబోయే 2030 సంవత్సరం నాటికి దీనిని ఏకంగా 14.41 లక్షల హెక్టార్లకు విస్తరించాలని ప్రభుత్వం ఒక భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఈ ప్రణాళిక ద్వారా పండ్ల తోటలు, కూరగాయలు, పూల సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహించి, ప్రాంతీయంగా పంటల ఉత్పాదకతను అంతర్జాతీయ స్థాయికి పెంచేందుకు పక్కా వ్యూహంతో ముందుకు సాగుతోంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును విజయవంతం చేయడం కోసం అటు ప్రభుత్వ నిధులు, ఇటు ప్రైవేటు భాగస్వామ్యాలు మరియు పెట్టుబడుల ద్వారా మొత్తంగా లక్ష కోట్లు వెచ్చించనున్నట్లు యంత్రాంగం వెల్లడించింది. కేవలం సాగు విస్తీర్ణం పెంచడమే కాకుండా, పండిన పంటలకు సరైన గిట్టుబాటు ధర కల్పించేందుకు కోల్డ్ స్టోరేజ్ లింకులు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు మరియు అంతర్జాతీయ ఎగుమతి కేంద్రాలను కూడా ఇక్కడ ఏర్పాటు చేయనున్నారు. ఈ మెగా హార్టికల్చర్ డ్రైవ్ వల్ల రాయలసీమ పరిధిలోని జిల్లాల్లో దాదాపు 9 లక్షల మంది నిరుద్యోగులకు మరియు స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

## కూలీల బొలేరో వాహనం బోల్తా




ఆంధ్రప్రదేశ్లోని అన్నమయ్య జిల్లాలో ఒక ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జిల్లాలోని చిన్నమండెం మండలం, కురవపల్లి గ్రామం సమీపంలో కూలీలతో ప్రయాణిస్తున్న ఒక బొలేరో వాహనం అదుపుతప్పి అకస్మాత్తుగా బోల్తా పడింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో వాహనంలో ప్రయాణిస్తున్న దాదాపు 20 మంది కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. వాహనం వేగంగా వెళ్తుండగా అదుపుతప్పడమే ఈ ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది.

# చిన్ననాటి రోజులు గుర్తొచ్చాయ్



కుప్పం: చిత్తూరు జిల్లా కుప్పం పర్యటనకు వెళ్లిన సీఎం చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు.. మార్గంమధ్యలో రోడ్డుపక్కన ఆగి తాటిముంజలు తిన్నారు. కుప్పంలో ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతరకు వెళ్లి పట్టువస్త్రలు సమర్పించిన తర్వాత తిరుగు ప్రయాణంలో తంజమ్మకొట్టాలు వద్ద కల్లు గీత కార్మికులు తాటి ముంజలు తీస్తుండటాన్ని గమనించి ఆగారు. దీనికి సంబంధించిన ఫొటోలను చంద్రబాబు, భువనేశ్వరి సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఃకల్తీ లేదు.. కార్బైడ్ లేదు. పురుగు మందుల గోల లేదు. మా కుప్పం ప్రజల మనసుల్లాంటి స్వచ్ఛమైన, చల్లనైన తాటి ముంజలు రోడ్డు పక్క ఆగి తింటుంటే ఎంతో హాయిగా ఉంది. మన గ్రామీణ ఆహార ఉత్పత్తులకు మించింది ఏముంటుంది!"అని చంద్రబాబు పేర్కొన్నారు. తాజా తాటి ముంజలను రుచి చూశాం. చిన్ననాటి రోజులు గుర్తొచ్చాయ్. కల్లుగీత కార్మికులతో కాసేపు మాట్లాడి వారి వృత్తి సమస్యలు, కుటుంబ పరిస్థితులను చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు" అని భువనేశ్వరి తెలిపారు.

# అందానికి ఐస్ మంత్రం..




ఈ తరం ఆలోచనలు కాస్త వైవిధ్యంగా ఉంటున్నాయి. పైకి ఆధునికంగా కనిపిస్తున్నా మినిమలిజంవైపే మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా చర్మ సౌందర్యం విషయానికి వస్తే, రసాయనాలతో కూడిన ఖరీదైన క్రీముల కంటే సహజసిద్ధమైన, తక్షణ ఫలితాలనిచ్చే వాటికే ఓటేస్తున్నారు. అలా వచ్చిందే ఈ స్కిన్ ఐసింగ్ ట్రెండ్ కూడా. ముఖాన్ని ఐస్ వాటర్ ముంచడం లేదా ఐస్ క్యూబ్స్ మసాజ్ చేయడమే ఈ కోల్డ్ థెరపీ స్టైల్. కొరియన్ బ్యూటీ సీక్రెట్స్లో ఒకటైన ఈ పద్ధతిని నేటి యువత ఇష్టంగా అనుసరిస్తోంది. సెలబ్రిటీలు సైతం తమ మార్నింగ్ స్కిన్కేర్ రొటీన్లో దీనికి ప్రాధాన్యం ఇస్తుండటంతో జెనీల బ్యూటీ ప్రపంచంలో టాప్ ట్రెండ్గా నిలిచింది. రీల్స్, సెల్ఫీల్లో ఎప్పుడూ ఫ్రెష్గా కనిపించాలనుకునే యువత దీన్ని బెస్ట్ ఆప్షన్గా ఎంచుకుంటున్నారు. ఐస్ మసాజ్ వల్ల రక్త ప్రసరణ జరిగి... తక్కువ సమయంలోనే ముఖం తాజాగా, కాంతివంతంగా కనిపిస్తుంది. ఓపెన్పోర్స్ మూసుకుంటాయి. చర్మం మృదువుగా మారి, మేకప్ వేసుకోవడానికి చక్కటి బేస్ సిద్ధమవుతుంది. ఇలా ఒకటా రెండా... ఎన్నెన్నో ప్రయోజనాలు... అలాగని కేవలం నీటితోనే కాదు... గ్రీన్టీ, రోజ్వాటర్, కలబంద, కీరదోస-నిమ్మరసం... వంటి వాటితోనూ ఈ యాంటీ ట్యాన్ క్యూబ్స్ తయారు చేస్తున్నారు. అయితే ఈ ఐస్ ముక్కల్ని నేరుగా కాకుండా వస్త్రంలో కట్టి ఉపయోగించడం, ఎక్కువ సేపు ఒకే ప్లేస్లో ఉంచకపోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు.

## చర్మ సంరక్షణలో బొప్పాయి గింజల మ్యాజిక్

బొప్పాయి తిన్న తర్వాత చాలామంది గింజలను పారేస్తుంటారు. కానీ ఈ చిన్న నల్ల గింజలు చర్మ సంరక్షణలో ఎంతో ఉపయోగపడతాయని నిపుణులు చెబుతున్నారు. బొప్పాయి గింజల్లో ఎంజైమ్లు, ఫ్లేవనాయిడ్లు, పాలీఫెనాల్స్, ఆరోగ్యకరమైన ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి చర్మంపై పేరుకుపోయిన మురికి, అదనపు నూనె, మృత కణాలను తొలగించడంలో సహాయపడతాయి. వీటిని క్రమం తప్పకుండా ఉపయోగిస్తే చర్మం సహజ కాంతిని పొందుతూ తాజాగా కనిపిస్తుంది.

చర్మానికి బొప్పాయి గింజల ప్రయోజనాలు

బొప్పాయి గింజలతో తయారు చేసే ఫేస్ స్క్రబ్ చర్మాన్ని సున్నితంగా ఎక్స్ఫోలియేట్ చేస్తుంది. దీంతో చర్మం నునుపుగా, మృదువుగా మారుతుంది. అలాగే చర్మాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుందని చెబుతున్నారు. ఇందులోని గుణాలు కొల్లాజెన్ ఉత్పత్తికి కూడా తోడ్పడతాయి. కొల్లాజెన్ చర్మాన్ని యవ్వనంగా, ఆరోగ్యంగా ఉంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. అందువల్ల బొప్పాయి గింజల స్క్రబ్ వాడితే చర్మం మరింత కాంతివంతంగా కనిపించే అవకాశం ఉంటుంది.

ముందుగా బొప్పాయి గింజలను శుభ్రంగా కడిగి కొద్దిగా ఆరనివ్వాలి. తర్వాత వాటిని మిక్సీలో వేసి మెత్తగా పొడిలా చేసుకోవాలి. అందులో ఒక టీస్పూన్ బాదం నూనె, ఒక టీస్పూన్ బియ్యప్పిండి వేసి బాగా కలపాలి. ఇలా పేస్ట్లా తయారైన మిశ్రమాన్ని ముఖానికి మృదువుగా రాయాలి.



## మామిడికే రారాజు నూర్జహాన్



వేసవి అనగానే మనకు గుర్తుకు వచ్చే వాటిలో మామిడి ఒకటి. మరి ఆ మామిడి కాయల్లో ఎన్ని రకాలు ఉన్నాయో మీకు తెలుసా! ముఖ్యంగా దశేరి, లంగ్డా, చౌసా వంటి రకాల మామిడి కాయలు ప్రజల్లో విశేష ఆదరణ పొందాయి. అయితే, మధ్యప్రదేశ్కు చెందిన నూర్జహాన్ మామిడి పండును మీరు ఎప్పుడైనా రుచి చూశారా? మామిడి పండును పండ్ల రారాజుగా పిలిచినట్లే, ఈ నూర్జహాన్ రకాన్ని మామిడి పండ్ల రారాజుగా కీర్తిస్తారు. భారతదేశంలోనే నూర్ జహాన్ ఒక అత్యంత విశిష్టమైన మామిడి రకం. ఒక్కో పండు ఏకంగా 3 కిలోల వరకు బరువు తూగుతుంది.సరిగ్గా ఇదే కారణం చేత, ఈ మామిడి పండ్లను బరువు ఆధారంగా (కిలోల చొప్పున) కాకుండా, ఒక్కో పండు చొప్పున విక్రయిస్తారు. ఒక్కో పండు ధర ఏకంగా రూ.3,000 వరకు పలుకుతుంది.

ఒక్క కాయ బరువు 2 నుంచి 5 కిలోలు

మధ్యప్రదేశ్లోని గిరిజన ప్రాబల్యం కలిగిన అలీరాజ్పుర్ జిల్లాలోని కట్టీవాడా ప్రాంతంలో సాగు చేసే నూర్జహాన్ మామిడి, తన భారీ పరిమాణం, విశిష్టమైన రుచి, ఆకర్షణీయమైన రూపానికి ప్రసిద్ధి చెందింది. ప్రపంచంలోనే అతిపెద్ద మామిడి రకాలలో ఒకటిగా దీనిని పరిగణించారు. సాధారణంగా ఒక్కో నూర్జహాన్ మామిడి పండు 2 నుంచి 5 కిలోల మధ్య బరువు ఉంటుంది. దీని పరిమాణం ఎంత భారీగా ఉంటుందంటే, ఒకే పండు ఒక కుటుంబం మొత్తానికి సరిపోతుందని భావిస్తారు. దీని రంగు, సువాసన, తీపిదనం ఎంతటి ఆకర్షణీయంగా ఉంటాయంటే, చూసిన వెంటనే ఎవరైనా దీని పట్ల ఇట్టే ఆకర్షితులవుతారు.

ఒక్కో పండు రూ.3,000

నూర్జహాన్ మామిడి పండుకు ముఖ్యంగా ప్రధాన నగరాల్లో, అంతర్జాతీయ మార్కెట్లలో భారీ డిమాండ్ ఉంది. ఒక్కో పండు ధర రూ.3,000 వరకు ఉండటానికి కారణం కేవలం దాని భారీ పరిమాణం మాత్రమే కాదు, దాని అరుదుదనం కూడా. ఈ రకం చెట్లు పరిమిత సంఖ్యలో మాత్రమే పండ్లను ఇస్తాయి.

## విరిగిన ఎముకలను అతికించే అద్భుత ఔషధం



ప్రకృతిలో లభించే అనేక మొక్కలు అద్భుతమైన ఔషధ గుణాలను కలిగి ఉంటాయి. వాటిలో నల్లేరు ఒకటి.

దీనిని సంస్కృతంలో 'వజ్రవల్లి' లేదా 'అస్థి సంహార' అని పిలుస్తారు. ఎముకల ఆరోగ్యాన్ని కాపాడటంలో ఇది అద్భుతంగా పనిచేస్తుందని, అందుకే దీనికి ఆ పేరు వచ్చిందని ఆయుర్వేద నిపుణులు వివరిస్తున్నారు. పొడవాటి కాడలు, కణుపులతో ఉండే ఈ మొక్క గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి ప్రహరీల వద్ద విరివిగా కనిపిస్తుంది.

మెట్రో








## హీట్ తగ్గించి ఎనర్జీ పెంచే నేచురల్ డ్రింక్

బయట ఎండలు పెరుగుతున్నాయి, కొంచెం దూరం వెళ్ళగానే నీరసం వచ్చేస్తోంది కదూ! ఇలాంటి టైమ్లో బాడీని కూల్ చేస్తూ, ఇన్సంట్ ఎనర్జీ ఇచ్చే డ్రింక్ ఏదైనా ఉంటే బాగుంటుందని అందరూ అనుకుంటారు. మనకు అందుబాటులో ఉండే పైనాపిల్ (అనాస పండు) జ్యూస్ అందుకు బెస్ట్ ఆప్షన్. ఇది కేవలం దాహం తీర్చడమే కాదు, మన బాడీకి కావలసిన బోలెడు విటమిన్లను కూడా అందిస్తుంది. ఇన్స్టంట్ ఎనర్జీ బూస్టర్: ఎండలో తిరగడం వల్ల బాడీలోని గ్లూకోజ్ లెవల్స్ తగ్గిపోయి త్వరగా అలసిపోతాము. పైనాపిల్ జ్యూస్లో ఉండే నేచురల్ షుగర్స్ మన శరీరానికి వెంటనే శక్తిని ఇస్తాయి. ఒక గ్లాసు పైనాపిల్ జ్యూస్ తాగితే చాలు, నిమిషాల్లోనే యాక్టివ్గా మారిపోతారు. ఇందులోని విటమిన్ జ రోజంతా ఉత్సాహంగా ఉండటానికి సహాయపడుతుంది.

శరీరాన్ని చల్లబరుస్తుంది: పైనాపిల్లో నీటి శాతం చాలా ఎక్కువ. ఇది వేసవిలో వచ్చే డీహైడ్రేషన్ సమస్యను దూరం చేస్తుంది. శరీరంలోని వేడిని తగ్గించి లోపల చల్లగా ఉండేలా చేస్తుంది. ఎండ వల్ల వచ్చే నీరసం, తల తిరగడం వంటి సమస్యలకు ఇది మంచి పరిష్కారం.

జీర్ణక్రియకు ఎంతో మేలు: పైనాపిల్లో 'బ్రోమెలైన్' అనే ప్రత్యేకమైన ఎంజైమ్ ఉంటుంది. ఇది మనం తిన్న ఆహారం త్వరగా అరిగేలా చేస్తుంది. వేసవిలో చాలామందికి కడుపు ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలు వస్తుంటాయి. ఇక భోజనం తర్వాత లేదా మధ్యలో పైనాపిల్ జ్యూస్ తాగితే జీర్ణ వ్యవస్థ సాఫీగా పనిచేస్తుంది.

రోగ నిరోధక శక్తి పెరుగుతుంది:ఈ జ్యూస్లో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి మన శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపి, ఇమ్యూనిటీని పెంచుతాయి. ఇక వేసవిలో వచ్చే వైరల్ ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా ఉండాలంటే పైనాపిల్ జ్యూస్ను మీ డైట్లో చేర్చుకోవడం చాలా అవసరం.

చర్మ సౌందర్యానికి ప్లస్: ఎండ వల్ల చర్మం నల్లబడటంలేదా పొడిబారడం జరుగుతుంది. పైనాపిల్ జ్యూస్ క్రమం తప్పకుండా తాగితే చర్మం కాంతివంతంగా మారుతుంది. ఇక ఇది చర్మాన్ని లోపలి నుండి హైడ్రేట్గా ఉంచుతుంది, తద్వారా మొటిమలు, మచ్చలు తగ్గుతాయి.

వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి కూల్ డ్రింక్స్ వైపు వెళ్లకుండా, ఇలాంటి నేచురల్ ఫ్రూట్ జ్యూస్ తీసుకోవడం చాలా ఉత్తమం. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆరోగ్యాన్ని ఇచ్చే పైనాపిల్ జ్యూస్ను ఈ సీజన్లో అస్సలు మిస్ అవ్వకండి.

## ద్రాక్ష, అరటిపండ్లు.. ఆరోగ్యానికి ఏది బెస్ట్..?



ఆరోగ్యంగా ఉండాలంటే పండ్లు తినాలి.. కానీ షుగర్ లెవల్స్ పెరగకూడదు.. డయాబెటిస్ బాధితులు ఎదుర్కొనే అతిపెద్ద టాస్క్ ఇది. ప్రధానంగా ద్రాక్ష, అరటిపండ్ల విషయంలో అనేక అపోహలు ఉన్నాయి. ద్రాక్షలోని తీపి, అరటిలోని ఫైబర్ మన శరీరంపై ఎలా ప్రభావం చూపుతాయి? మీ రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకుంటూనే ఈ పండ్లను ఎలా ఆస్వాదించాలో తెలుసుకుందాం..

డయాబెటిస్ అనగానే చాలామందికి గుర్తొచ్చే మొదటి ఆలోచన.. ఇక పండ్లు తినడం మానేయాలి. ఇది మన సమాజంలో డయాబెటిస్ బాధితులకు ఇచ్చే అత్యంత సాధారణ సలహా. కానీ ఇది ఎంతవరకు నిజం? పండ్లలో ఉండే సహజ చక్కెరలు నిజంగానే రక్తంలో చక్కెర స్థాయిలను అమాంతం పెంచుతాయా? ముఖ్యంగా అందరికీ ఇష్టమైన ద్రాక్ష, అరటిపండ్ల విషయంలో డైటీషియన్లు, ఆరోగ్య నిపుణులు ఏం చెబుతున్నారు? అనేది తెలుసుకోవడం అందరికీ ఆసక్తి.

ద్రాక్ష పండ్లు: తియ్యని ప్రమాదం పొంచి ఉందా?

ద్రాక్ష పండ్లు చూడటానికి చిన్నగా, తినడానికి చాలా రుచిగా ఉంటాయి. కానీ వీటి విషయంలో పోర్షన్ కంట్రోల్ చాలా ముఖ్యం. ద్రాక్షలో పీచు పదార్థం చాలా తక్కువగా ఉంటుంది. దీనివల్ల ఇవి తిన్న వెంటనే అందులోని చక్కెర నేరుగా రక్తంలోకి చేరుతుంది. ద్రాక్షను మనం ఒక్కొక్కటిగా లెక్కపెట్టి తినడం కష్టం. తెలియకుండానే ఒక గుత్తిని ముగించేస్తాం. దీనివల్ల శరీరంలోకి ఒక్కసారిగా ఎక్కువ గ్లూకోజ్ చేరుతుంది. వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, నీటి శాతం శరీరానికి మంచిదే, కానీ రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉన్నవారు వీటిని పరిమితంగా తీసుకోవాలి.


అరటిపండ్లు

అరటిపండు ప్రభావం అది ఎంతవరకు పండింది అనే దానిపై పూర్తిగా ఆధారపడి ఉంటుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. వీటిలో రెసిస్టెంట్ స్టార్చ్ ఎక్కువగా ఉంటుంది. ఇది జీర్ణం కాకుండానే పేగుల ద్వారా వెళుతుంది కాబట్టి రక్తంలో చక్కెరను వెంటనే పెంచదు. పైగా ఇది ఇన్సులిన్ పనితీరును మెరుగుపరుస్తుంది. అరటిపండుపై నల్లటి మచ్చలు వచ్చాయంటే.. అందులోని స్టార్చ్ అంతా సింపుల్ షుగర్గా మారిపోయిందని అర్థం. ఇది తిన్న నిమిషాల్లోనే షుగర్ లెవల్స్ పెంచుతుంది. ఒక మధ్యస్థ అరటిపండులో 3 గ్రాముల ఫైబర్ ఉంటుంది. ఇది చక్కెర శోషణను కొంతవరకు నెమ్మదింపజేస్తుంది.

మెట్రో ఈవినింగ్స్ సినిమా


# పొరపాటున కూడా నా కలలోకి రావొద్దు...

దేవుడు నాకొక గొప్ప వరం ఇచ్చాడు... ట్రిగ్గర్ నొక్కగానే మరిచిపోవడం. నిదరపోయినప్పుడు నా కల్లోకి నేను చంపినవాళ్ల ముఖాలు రావు, మిగిలివున్న శత్రువుల ముఖాలే కనపడతాయి. పొరపాటున కూడా నా కల్లోకి రావొద్దు.... అంటున్నాడు డ్రాగన్ అవతారంలో ఎన్టీఆర్. డ్రాగన్ కథేమిటో తెలియాలంటే వచ్చే ఏడాది వరకూ ఎదురు చూడాల్సిందే. ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రమే డ్రాగన్. మైత్రీ మూవీ మేకర్స్, నందమూరి తారక రామారావు ఆర్ట్స్, టీ సిరీస్ ఫిల్మ్స్ సంస్థలు రూపొందిస్తున్నాయి. నందమూరి కల్యాణ్‌రామ్, నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి, కొసరాజు హరికృష్ణ నిర్మాతలు. ఎన్టీఆర్ పుట్టినరోజుని పురస్కరించుకుని మంగళవారం రాత్రి గ్లింప్స్ విడుదల చేస్తూ పేరుని అధికారికంగా ప్రకటించింది చిత్రబృందం.





# కేన్స్‌లో మెరిసిన జాక్వెలిన్



ప్రత్యేక గీతాల్లో స్టెప్పులు... వైవిధ్యమైన పాత్రల్లో గ్లామర్‌కు నటనను జోడించి కనిపిస్తూ ప్రేక్షకుల్ని అలరిస్తుంటుంది అందాల తార జాక్వెలిన్ ఫెర్నాండెజ్. సినీ పరిశ్రమ, ఫ్యాషన్ రంగం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే కేన్స్ చిత్రోత్సవాల్లో తాజాగా సందడి చేసింది భామ. ఈ వేడుకలో ఇప్పటికే పలువురు భారతీయ తారలు మెరిశారు. ఇందులో భాగంగానే ఇప్పుడు కేన్స్‌లో విశిష్టమైన ది మిరాకిల్స్ గాలాకు ప్రపంచ ప్రసిద్ధ తారలతోపాటు ఈ ఏడాది భారతీయ సెలబ్రిటీగా జాక్వెలిన్ హాజరైంది. క్లాసిక్ హాలీవుడ్ గ్లామర్ లుక్ అలవోకగా ప్రదర్శిస్తూ సినీప్రియుల దృష్టిని ఆకర్షించింది. ఈ సందర్భంగా ఇన్స్టాలో జాక్వెలిన్.. కేన్స్‌లో మిరాకిల్ షో కోసం జాక్వెలిన్ తదుపరి హీరో అక్షయ్ కుమార్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన వెల్కమ్ టు ది జంగిల్ సినిమాలో కనిపించనుంది.



# లుక్కు... క్లిక్కు!

కథానాయకుడు నందమూరి బాలకృష్ణ.. దర్శకుడు కొరటాల శివ కలయికలో కొత్త చిత్రం పట్టాలెక్కనుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా బాలకృష్ణ లుక్ టెస్ట్ని పూర్తి



చేసినట్లు సమాచారం. దీంట్లో ఆయన పాత్రని కొరటాల చాలా శక్తిమంతమైన రీతిలో డిజైన్ చేసినట్లు తెలిసింది. దీనికి తగ్గట్లే తన లుక్ కూడా మునుపెన్నడూ చూడని విధంగా సరికొత్తగా కనిపించనున్నట్లు తెలుస్తోంది. బలమైన సామాజిక సందేశమున్న యాక్షన్ కథతో ఈ సినిమా ముస్తాబు కానుంది. రాజకీయ అంశాలకు ఎంతో ప్రాధాన్యత ఉండనుంది. జూన్ 10న బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా లుక్తో పాటుగా ఈ చిత్ర విశేషాలు బయటకొచ్చే అవకాశముంది.

# ముందు ఆర్థిక స్వేచ్ఛ.. తర్వాతే పెళ్లి





మహిళలు ఎవరిని పెళ్లి చేసుకుంటారనే దానికంటే. మీరు ఏం చేస్తారు, మీరు ఎవరనేదే ముఖ్యం అంటున్నారు బాలీవుడ్ కథానాయిక కంగనా. వివాహిత మహిళలు ఎదుర్కొంటున్న పరిస్థితులపై ఆమె తాజాగా ఇన్స్టా స్టోరీలో ఒక నోట్ పంచుకున్నారు. ఇందులో యువతులు వివాహ బంధంలోకి అడుగుపెట్టే ముందు ఆర్థిక స్వాతంత్ర్యంతో పాటు తమ కెరీర్ను నిర్మించుకోవడంపై దృష్టి పెట్టాలని తెలిపారు. రోజూ పెళ్లి అయిన యువతుల గురించి ఎన్నో విషాద వార్తలు వస్తున్నాయి. చదువుకున్న యువతులలో చాలా మంది ఆ విషాదం ఎదురుకాకముందే.. తమని ఉక్కిరిబిక్కిరి చేసే పరిస్థితుల నుంచి బయటపడేయమని తమ తల్లిదండ్రులను వేడుకుంటున్నారు. కానీ, భారతీయ సమాజం కూతుళ్లకు పెళ్లయ్యాక వారిని వదిలేస్తుంది. మీ జీవితంలో మరెవరోకన్నా మీ కెరీరే మీకు ముఖ్యం. మీరు ఆర్థికంగా స్వేచ్ఛగా ఉన్న తర్వాతే పెళ్లి గురించి ఆలోచించండి. దయచేసి, మీ జీవితానికి మీరే హీరో అయి ఉండండి. మిమ్మల్ని కాపాడటానికి ఎవరూ రారు. మీరు ఎవరిని పెళ్లి చేసుకుంటారనే దానికంటే మీరు ఏం చేస్తున్నారు. ఎవరు అనేదే ముఖ్యం. మీకు కావాల్సిన జీవితాన్ని మీరే నిర్మించుకోండి.

# బయటకు పంత్

గువాహటి: పేలవ ఫామ్‌తో ఇబ్బందిపడుతున్న వికెట్ కీపర్ రిషభ్ పంత్‌పై వేటు పడింది. అఫ్ఘానిస్థాన్‌తో జరగబోయే ఏకైక టెస్టు, మూడు వన్డేల కోసం మంగళవారం జాతీయ సెలెక్షన్ కమిటీ భారత జట్లను ప్రకటించింది. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలో వచ్చే నెల 6 నుంచి ముల్లన్‌పూర్‌లో టెస్టు, 14 నుంచి ధర్మశాల, లఖ్‌నవూ, చెన్నైలలో వన్డేలు జరగనున్నాయి. ఇందులో భాగంగా పంత్‌ను టెస్టు వైస్‌కెప్టెన్సీ నుంచి తొలగించగా, వన్డే జట్టులో చోటు కోల్పోయాడు. అతను చివరిసారిగా 2024లో చాంపియన్స్ ట్రోఫీ జట్టులో ఉన్నా బరిలోకి దిగే చాన్స్ రాలేదు. ఇక పని ఒత్తిడిలో భాగంగా స్టార్ పేసర్ బుమ్రాకు టెస్టు, వన్డేలకు విశ్రాంతినిచ్చారు. అయితే ఇంగ్లండ్ పర్యటనకు అందుబాటులో ఉంటాడని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ తెలిపాడు. టెస్టు జట్టులో ఎడమచేతివాటం స్పిన్నర్లు మానవ్ సుతార్, హర్ష్ దూబేలతో పాటు పేసర్ గుర్నూర్ బ్రార్‌లకు తొలిసారి అవకాశం దక్కింది. వెటరన్ పేసర్ మహ్మద్ షమితో పాటు కశ్మీర్ పేసర్ అకీబ్ నబీలను సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకోలేదు.



**ఇషాన్‌కు పిలుపు:** చాలా రోజుల తర్వాత భారత్ తరఫున టీ20ల్లో ఆడిన వికెట్ కీపర్ ఇషాన్ కిషన్‌ను వన్డేలకు కూడా ఎంపిక చేశారు. రెండో కీపర్‌గా వ్యవహరించనున్న ఇషాన్ 2023లో ఆఖరి వన్డే ఆడాడు. ఇక ఈ ఫార్మాట్‌లో పేసర్ ప్రిన్స్ యాదవ్‌తో పాటు గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబేలకు కూడా తొలిసారి అవకాశం దక్కింది. మరోవైపు వెటరన్ స్టార్ రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యాలను ఎంపిక చేసినప్పటికీ.. వారు తమ ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాల్సి ఉంటుంది. అలాగే సిరాజ్‌కు వన్డేల నుంచి విశ్రాంతినివ్వగా.. రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్‌లకు రెండు జట్లలోనూ చోటు దక్కలేదు.

**టెస్టు జట్టు:** శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), జైస్వాల్, కేఎల్ రాహుల్ (వైస్‌కెప్టెన్), సాయి పడిక్కళ్, నితీశ్ కుమార్, సుందర్, కుల్దీప్, సిరాజ్, ప్రసిద్ధ్, మానవ్ సుతార్, గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబే, ధ్రువ్ జురెల్.

**వన్డే జట్టు:** గిల్ (కెప్టెన్), శ్రేయాస్ (వైస్‌కెప్టెన్), రోహిత్ శర్మ, కోహ్లీ, రాహుల్, ఇషాన్, హార్దిక్, నితీశ్ కుమార్, సుందర్, హర్ష్ దూబే, కుల్దీప్, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్, ప్రిన్స్ యాదవ్, గుర్నూర్ బ్రార్.

# డికాక్, రాజ్ ఐపీఎల్‌కు దూరం

ముంబై: గాయాల కారణంగా ముంబై ఇండియన్స్ వికెట్ కీపర్ క్వింటన్ డికాక్, ఆల్‌రౌండర్ రాజ్ బవా ఐపీఎల్‌లో మిగిలిన రెండు మ్యాచ్‌లకు దూరమయ్యారు. ఈ సీజన్‌లో ఈ ఇద్దరూ కేవలం మూడు మ్యాచ్‌లు మాత్రమే ఆడారు.




మెట్రో స్పోర్ట్స్




# ఐపీఎల్‌కు అతీతంగా ఎదగండి!

బెంగళూరు: రాత్రికి రాత్రే స్టార్లను చేసే ఐపీఎల్‌కు అతీతంగా ఎదగాలని యువ క్రికెటర్లకు కోహ్లీ పిలుపునిచ్చాడు. క్రికెట్ ప్రపంచం నుంచి గౌరవం అందుకొనేందుకు ఆల్ ఫార్మాట్ ప్లేయర్లుగా రాణించాలని సూచించాడు. 'నేటి కాలంలో డబ్బే అన్నింటినీ నడిపిస్తోంది. ఐపీఎల్‌లో 20 బంతుల్లోనే 40-50 పరుగులు చేసి ఒక్కసారిగా పాపులర్ అవుతున్నారు. ఆర్థికంగానూ సౌకర్యవంతమైన స్థితికి చేరుకొంటున్నారు. అయితే, అదే అంతిమ లక్ష్యం కారాదు' అని ఆర్సీబీ ఇన్నోవేటివ్ ల్యాబ్స్ ఇండియన్ స్పోర్ట్స్ సమ్మిట్‌లో కోహ్లీ అన్నాడు. ఐపీఎల్ మాత్రమే లక్ష్యంగా ప్రయాణం సాగకూడదని యువ ఆటగాళ్లకు విరాట్ సూచించాడు. తాను మళ్లీ క్రికెట్‌ను ఆస్వాదించడానికి కోచ్‌లు రాహుల్ ద్రవిడ్, విక్రమ్ రాథోడ్ ఎంతో సహకారం అందించారన్నాడు.


Published, Printed, Edited and Owned by **DEVARAKONDA KALIDAS** Printed at DK Publications, 2-3-691/1/A, CPL Main Road, Amberpet, Hyderabad and Published at D.No.1-9-628/4, J.P.Residency, Vidyangar, Hyderabad - 44, **Editor: D.Kalidas, RNI.NO.68319/98, Post Regd.No. HSE/953/2014-16** Phone: 99126 14007, 040-27421007